ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

అన్నమయ్య

జిల్లా వార్తలు

5

బుధవారం 5 ఫిబ్రవరి 2025



దేవునికడపలో సాగుతున్న స్వామివారి రథం

కాంచిన కనులదే భాగ్యం

- అద్వితీయం బ్రహ్మాండనాయకుని రథోత్సవం
- పోటెత్తిన భక్తజనం
- గోవిందనామ స్మరణతో మార్మోగిన దేవునికడప






కడప కల్చరల్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ఏడుకొండలవాడుగా.. ఆపద మొక్కుల వాడుగా.. అభయప్రదాతగా.. అశేష భక్తజన నీరాజనాలందుకుంటున్న శ్రీనివాసుని రథోత్సవం కాంచిన కనులదే భాగ్యం అన్నట్టుగా సాగింది. బ్రహ్మాండనాయకుడి రథోత్సవాన్ని తిలకించేందుకు జిల్లా నలుమూలల నుంచి వచ్చిన భక్తజనంతో దేవునికడప వీధులు పోటెత్తాయి. తిరుమల తొలిగడపగా ఖ్యాతిగాంచిన లక్ష్మీవెంకటేశ్వరస్వామి దేవస్థానం ఆలయ వార్షికోత్సవాలలో భాగంగా మంగళవారం స్వామివారి రథోత్సవం కనులపండువగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణాన్ని అరటి, మామిడి ఆకుల తోరణాలతో, విద్యుత్‌దీప కాంతులతో ముస్తాబు చేశారు. స్వామివారు ఊరేగే రథాన్ని వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. శ్రీదేవి భూదేవి సమేత తిరుమలేశుని ముస్తాబుగావించి రథంపై కొలువుదీర్చారు. ఏడుకొండల వాడిని దర్శించుకునేందుకు తెల్లవారుజాము నుంచే భక్తులు బారులు తీరారు. నగరంలోని క్రిష్ణ సర్కిల్ నుంచి దేవునికడప వెళ్లే మార్గం భక్తులతో నిండిపోయింది. అడుగడుగునా భక్తులు గోవిందనామస్మరణతో దేవునికడప పురవీధులు మారుమోగాయి.

రథం లాగేందుకు పోటీ పడ్డ భక్తులు

వైకుంఠవాసుడు కొలువుదీరిన రథాన్ని దేవునికడప యువత భక్తజనంతో కలిసి కదిలించారు. ఆలయ ప్రధాన అర్చకులు కృష్ణమోహన్, తరుణ్ వేదమంత్రాలు పఠిస్తుండగా.. సంగీత సుస్వరాలు, మంగళవాయిద్యాల నడుమ భక్తజనం కోలాహలంతో తేరు ముందుకు కదిలింది. రథాన్ని లాగేందుకు భక్తులు పోటీపడ్డారు. తేరు కదిలే ప్రదేశంలో గుమ్మడికాయలు, మిరియాలు చల్లి రథాన్ని తాకడమే భాగ్యంగా భక్తులు భావించారు. మాడవీధుల్లో స్వామివారు వస్తుంటే అక్కడి స్థానికులు ఆహ్వానం పలికి కాయకర్పూరం సమర్పించి మొక్కుబడులు తీర్చు కున్నారు. దారి పొడవునా అన్నమయ్య కీర్తనలు, కోలాటాలు, చెక్కభజనలతో కళాకారులు ఆకట్టుకున్నారు. అడుగడుగునా భక్తుల గోవిందనామ స్మరణతో దేవునికడప పురవీధులు మారుమోగాయి. మధ్యాహ్నం 3.30 గంటలకు మొదలైన రథోత్సవం సాయంత్రం 5.45 గంటలకు ముగిసింది. కడప ఎమ్మెల్యే ఆర్.మాధవి కుటుంబ సమేతంగా హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. రథోత్సవం సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా జిల్లా పోలీసు యంత్రాంగం కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. దేవునికడప ముఖ ద్వారం వద్దనే వాహనాలు నిలిపివేశారు. వాహనాలకు ప్రత్యేక పార్కింగ్ ఏర్పాటు చేశారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ ఈశ్వర్‌రెడ్డి దగ్గరుండి రథోత్సవం ఏర్పాట్లను పర్యవేక్షించారు.



తేరును లాగేందుకు పోటీపడుతున్న భక్తులు



వెంకటేశ్వరుని రథోత్సవం సందర్భంగా భక్తజనసంద్రంగా మారిన దేవునికడప వీధులు

సుండుపల్లెలో గజ..గజ...

- పంట పొలాల్లో ఏనుగుల బీభత్సం



ఏనుగుల దాడిలో ధ్వంసమైన రాతి కంచె, టెంకాయ చెట్లు

సుండుపల్లె, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ముడుంపాడు బీటు నగిరి, కటారుమడుగు పరిసర ప్రాంతాల్లో సోమవారం రాత్రి ఏనుగులు పంట పొలాలపై పడి బీభత్సం సృష్టించాయని రైతులు తెలిపారు. వరి, ఉలవ, టమోటా, అలసందలు, వేరుశనగ పంటలతో పాటు పొలాల చుట్టూ పాతిన రాతి కంచెను పీకేశాయని వాపోయారు. సుమారు 10, 15 సంవత్సరాల టెంకాయ చెట్లను వేళ్లతో సహా పెకిలించాయని, పైపులను ధ్వంసం చేశాయని తెలిపారు. విషయం తెలుసుకున్న అటవీశాఖ సిబ్బంది కటారుమడుగు పరిసర గ్రామాల్లో పర్యటించి పంట పొలాలను పరిశీలించారు. అటవీ ప్రాంత పరిధిలోని ముడుంపాడు, రాయవరం ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఏనుగుల సంచారం వలన ముడుంపాడు గ్రామ పంచాయతీ నగిరికి చెందిన అనసూయమ్మ, మల్లేశ్వరమ్మ, రమణమ్మ, వెంకటమల్లప్ప నాయుడు, చంద్రమ్మ, మాచిరెడ్డిగారిపల్లె గ్రామ పంచాయతీ నట్టగుట్టపల్లెకు చెందిన మూడే రమణానాయక్‌లు పంటలు నష్టపోయినట్లు, రాతి కంచెలను విరగొట్టాయని, పైపులు ధ్వంసం చేయడం గుర్తించామని డీఆర్‌వో రమేశ్‌బాబు తెలిపారు. పల్లెల చుట్టూ అటవీ ప్రాంతం సమీపంలో మామిడి చెట్లు ప్రస్తుతం పూత, పిందె దశలో ఉన్నాయని, అటువైపు ఏనుగులు వెళితే తీవ్రనష్టం వాటిల్లే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించి ఆదుకోవాలని కోరారు. ఆదివారం రాత్రి కూడా రాయవరం సమీపంలో వరి, వేరుశనగ ఇతర పంటలను ఏనుగులు ధ్వంసం చేసినట్లు రైతులు తెలిపారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

- ఉద్యాన యూనివర్సిటీ ఉపకులపతి గోపాల్ • అట్టహాసంగా ప్రారంభమైన ఉద్యాన కళాశాల క్రీడలు

రైల్వేకోడూరు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రీడల్లో బాగా రాణించి దేశానికి మంచి పేరు తీసుకురావాలని ఉద్యాన యూనివర్సిటీ ఉపకులపతి కె.గోపాల్ తెలిపారు. మంగళవారం రైల్వేకోడూరు మండలం అనంతరాజుపేట ఉద్యాన కళాశాల ఆవరణంలో అంతర్ కళాశాలల రాష్ట్ర స్థాయి క్రీడా, సాంస్కృతిక పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ క్రీడల్లో 9 కళాశాలలకు చెందిన సుమారు 500 మంది విద్యార్థులు క్రీడల్లో పాలుపంచుకున్నారని తెలిపారు. విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని, నైపుణ్యాలు పెంచుకుని ఉన్న స్థానాలకు చేరాలని తెలిపారు. రాజంపేట ఏఎస్పీ మనోజ్‌రామనాథ్‌హెగ్డే మాట్లాడుతూ తాను కూడా వ్యవసాయ విద్యార్థినే అని విద్యార్థులకు గుర్తు చేశారు. కళాశాలల్లో చదివే రోజుల్లో విద్యార్థులు భవిష్యత్ ప్రణాళిక రూపొందించుకుని ఆ దిశగా ప్రయత్నం చేయాలన్నారు. కార్యక్రమంలో డీఎస్‌పీ డాక్టర్ సూర్యకుమారి, అనంతరాజుపేట ఉద్యాన కళాశాల అసోసియేట్ డీన్ పీటీ శ్రీనివాస్, సీవోఈ ప్రసన్నకుమార్, వెంకటరామన్నగూడెం, పులివెందుల, ఉద్యాన కళాశాలల అసోసియేట్ డీన్లు డాక్టర్ దొరార్జీరావు, డాక్టర్ ఆర్.నాగరాజు, ఓఎస్‌పీ డాక్టర్ సయ్యద్ సదరున్నీసా, ఆచార్యులు రూత్‌బెనర్జీ, అసిస్టెంట్ ప్రొఫెసర్ మల్లికార్జునరెడ్డి, లలిత, ఫిజికల్ డైరెక్టర్ వై.రవిశంకర్ సిబ్బంది పాల్గొన్నారు.





జ్యోతి ప్రజ్వలన చేస్తున్న గోపాల్, వాలీబాల్ పోటీలో తలపడుతున్న క్రీడాకారులు

పరుగు పందెం విజేతలు

800 మీటర్ల పరుగు పందెం విభాగంలో మొదటి బహుమతిని తేజ (అనంతరాజుపేట), రెండో బహుమతి విజయ్ (వెంకటరామన్నగూడెం), మూడో బహుమతి గణేష్ (అనంతరాజుపేట)లు సాధించారు. 800 మీటర్ల పరుగు పందెంలో మొదటి బహుమతి సమీరా (చిన్నవటారపి), రెండో బహుమతి యమున (వెంకటరామన్నగూడెం), మూడో బహుమతి హారిక (అనంతరాజుపేట) సాధించారు. అదే విధంగా త్రోబాల్, వాలీబాల్ తదితర పోటీలు జరిగాయి.

కరుణించవమ్మా.. తోపు గంగమ్మ తల్లీ...

- రథసప్తమి సందర్భంగా మహానైవేద్యం



తోపు గంగమ్మ ఆలయంలో వివిధ వంటకాలతో తయారు చేసిన మహానైవేద్యం

రాయచోటిటౌన్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): రథసప్తమి సందర్భంగా సూర్య భగవానుడిని ప్రార్థిస్తూ రాయచోటి పట్టణంలోని పాతరాయచోటికి సమీపంలో మాండవ్యనది తీరాన వెలిసిన విజయ చాముండేశ్వరిదేవి (తోపు గంగమ్మ) ఆలయంలో మంగళవారం మహానైవేద్య కార్యక్రమాన్ని నిర్వహించారు. పట్టణానికి చెందిన భక్తులు రకరకాల పిండివంటలతో తయారు చేసిన భోజనాన్ని అమ్మవారి ఆలయానికి ఎదురుగా రాసులుగా పోసి శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. ప్రతి ఏడాది రథసప్తమి నాడు ఆలయ పూజారి అయిన మల్లికార్జునస్వామికి అమ్మవారు పూనడంతో పూజారి పూర్తి అమ్మవారి వేషధారణలో భక్తులకు రాసిగా పోసిన మహానైవేద్యాన్ని భక్తులకు పంచి పెట్టడం ఆనవాయితీగా వస్తోంది. మహానైవేద్య కార్యక్రమం అనంతరం అక్కడికి వచ్చిన భక్తులకు ఆలయ కమిటీ వైస్ చైర్మన్ రావూరి రవికుమార్, ఆలయ అర్చకులు అమ్మవారి తీర్థప్రసాదాలను అందించడంతో పాటు భోజన సౌకర్యాన్ని కల్పించారు.



ప్రత్యేక అలంకరణలో తోపు గంగమ్మ అమ్మవారు

షూటింగ్‌బాల్ టోర్నీలో జిల్లా వాసి ప్రతిభ

- ఫైనల్స్‌లో పాకిస్థాన్‌పై ఇండియా విజయం

మదనపల్లెటౌన్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ఏషియన్ రెండో షూటింగ్‌బాల్ పోటీల్లో పాకిస్థాన్‌పై భారత జట్టు ఫైనల్స్‌లో నెగ్గి చాంపియన్‌గా నిలిచింది. భారత జట్టులో మదనపల్లె క్రీడాకారుడు ప్రతిభ కనబరచి జట్టు విజయంలో కీలకపాత్ర పోషించాడు. నేపాల్ దేశంలో రెండో ఏషియన్ షూటింగ్ బాల్ చాంపియన్‌షిప్ పోటీలు నాలుగు రోజుల పాటు జరిగాయి. భారత జట్టులో 12 మంది క్రీడాకారులు పాల్గొనగా అందులో సౌత్‌ఇండియా నుంచి మదనపల్లెకు చెందిన మహమ్మద్ యూసఫ్ బాషా ఎంపికై అంతర్జాతీయ మ్యాచ్‌లో పాల్గొన్నాడు. సోమవారం రాత్రి జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో పాకిస్థాన్ జట్టుతో తలపడి జట్టు వరుస సెట్లలో 21-19, 21-12 పాయింట్లతో ఘన విజయం సాధించి చాంపియన్‌షిప్ ట్రోఫీ దక్కించుకుంది. భారత జట్టు విజయంతో మదనపల్లె క్రీడాకారుడు మహమ్మద్ యూసఫ్‌బాషా చురుగ్గా సర్వీసులు చేసి జట్టు విజయానికి దోహదపడ్డాడు. టీవీలో ప్రత్యక్ష ప్రసారం చూసిన మదనపల్లె క్రీడాకారులు సోమవారం రాత్రి సంబరాలు చేసుకున్నారు. కాగా మమమ్మద్ యూసఫ్‌బాషా స్వస్థలం వాల్మీకిపురం కావడంతో అక్కడి క్రీడాకారులు కూడా సంతోషం వ్యక్తం చేశారు. జిల్లా షూటింగ్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు గోల్డెన్‌వ్యాలీ రమణారెడ్డి, కార్యదర్శి నరేష్‌బాబు, కోశాధికారి సాయిశేఖర్‌రెడ్డి, సభ్యులు నాగేంద్రప్రసాద్, పవన్, సురేష్, సయ్యద్‌బాషా, మురళి, భారతి హర్షం వ్యక్తం చేశారు.





ఫైనల్ మ్యాచ్‌లో పాకిస్థాన్ జట్టుపై గెలిచిన ఆనందంలో భారతజట్టు, క్రీడాకారుడు యూసఫ్ బాషా

జగనన్న కాలనీలో అక్రమాలపై విజిలెన్స్ అధికారుల విచారణ

రాయచోటిటౌన్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని నారాయణరెడ్డిగారిపల్లెకు సమీపంలో గల జగనన్న హౌసింగ్ కాలనీలో జరిగిన అక్రమాలపై మంగళవారం విజిలెన్స్ అధికారులు విచారణ చేపట్టారు. పట్టణంలోని ఇళ్లు లేని వారి కోసం నారాయణరెడ్డిపల్లెకు సమీపంలో హౌసింగ్ కాలనీ ఏర్పాటు చేసి గత ప్రభుత్వం అక్కడ సుమారు 6 వేల కుటుంబాలకు ఇంటి పట్టాలను ఇవ్వడమే కాకుండా పక్కాగృహాలను మంజూరు చేసింది. నిర్మాణ సమయంలో హౌసింగ్ అధికారులు స్టీలు, ఇసుక, సిమెంటు తదితర సామాగ్రి సరఫరాలో పెద్ద మొత్తంలో అవకతవకలు జరిగాయని హౌసింగ్ అధికారులపై కలెక్టర్‌కు ఫిర్యాదులందాయి. దీనిపై గతంలో రెవెన్యూ డివిజన్ అధికారి జగనన్న కాలనీ అక్రమాలపై విచారించి సిమెంటు, కడ్డీల విషయంలో ఎలాంటి అక్రమాలు జరగలేదని, ఇసుకలో అక్రమాలు జరిగినట్లు నివేదికలు ఇచ్చారు. అయితే ఆ విచారణ సక్రమంగా జరగలేదన్న కారణంగా మంగళవారం విజయవాడ నుంచి వచ్చిన విజిలెన్స్ డీఈ చంద్రశేఖర్‌రాజు ఆధ్వర్యంలో అధికారులు జగనన్న కాలనీకి వెళ్లి సిమెంటు, కడ్డీలు, ఇసుక గోడౌన్‌లను తనిఖీ చేయడమే కాకుండా అక్కడున్న లబ్ధిదారులతో జరిగిన విషయాలపై ఆరా తీశారు. ఈ క్రమంలో అధికారులు ఇచ్చిన నివేదికలో తేడాలు ఉన్నట్లు గుర్తించి విజయవాడలోని హౌసింగ్ కార్యాలయంలోని రాష్ట్ర అధికారులకు ఇవ్వనున్నట్లు విజిలెన్స్ అధికారులు తెలిపారు. విజిలెన్స్ హౌసింగ్ డీఈ సుబ్బరామయ్య, ఏఈ రమణయ్య, హౌసింగ్ సిబ్బంది ఉన్నారు.

ఓట్లేసి రండి చూద్దాం

- వెటకారంగా ద్వితీయ శ్రేణి నేతలు
- నాలుగు గ్రామాలపై కక్ష సాధింపు
- భూములు ఆన్‌లైన్‌లో తొలగింపు
- రుణం కట్టమని ఒత్తిడి
- దిక్కుతోచని స్థితిలో రైతన్నలు



తరాలుగా సాగు చేసుకుంటున్న భూమి

బి.కోడూరు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): గతంలో మాకు ఓట్లు పడలేదు, ఈ దఫా ఓట్లేసి వస్తే అప్పుడు రైతుల సమస్యలను పరిశీలిస్తామని ఎమ్మెల్సీ వద్దనున్న ద్వితీయ శ్రేణి నేతలు రైతుల పట్ల వెటకారంగా మాట్లాడుతున్నారు. ఓట్లు వేయలేదని నాలుగు గ్రామాల్లో సుమారు 1200 ఎకరాల భూములను ఆన్‌లైన్‌లో తొలగించడంతో రైతులకు ఇబ్బందలు తప్పలేదు. ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి దగ్గరకు వెళ్లి మా భూములు ఆన్‌లైన్ నుంచి తొలగించారు, మీరైనా చెప్పండని గగ్గోలు పెట్టుకున్నా ఫలితం శూన్యం. అప్పటి నుంచి ఇప్పటి వరకు కలెక్టరు, ఆర్డీఓ, తహసీల్దారు కార్యాలయాల చుట్టూ రైతులు కాళ్లరిగేలా తిరుగుతున్నారు. ప్రభుత్వం మారినా వారికి ఇబ్బందులు తప్పడంలేదు. రుణాల బకాయిలు చెల్లించాలని బ్యాంకు అధికారులు గ్రామాల్లో రైతులను నిలదీస్తున్నారు. వైసీపీ ప్రభుత్వంలో పడిన ఇబ్బందులే ప్రస్తుత కూటమి ప్రభుత్వంలోనూ పడుతున్నామని పలువురు రైతులు వాపోతున్నారు. తరాలుగా బావుల తవ్వకం, మోటార్లు బాగించుకోవడం, ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేసుకున్నా ఆన్‌లైన్‌లో పేర్లను తొలగించారు. దీంతో చేసేదిలేక రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. ఆన్‌లైన్‌లో పేర్లు తొలగించడంతో రుణాలు ఏకమొత్తంలో కట్టడమా, రెన్యువల్ చేయించుకోవడమా జరగాలని బ్యాంకు అధికారులు ఒత్తిడి తెస్తున్నారు. రెవెన్యూ సదస్సులు నిర్వహించి రైతుల భూ సమస్యలన్నీ తీర్చుతామని కూటమి ప్రభుత్వం ప్రకటనలతో రైతులు ఎంతో ఆశతో ఇప్పటికే రెండు గ్రామసభల్లో అర్జీలు ఇచ్చి అధికారులతో మొరపెట్టుకున్నా ఇంత వరకు ఎలాంటి పరిష్కారం దొరకలేదు.

ఆ నాలుగు గ్రామాలపై కక్ష

పాయలకుంట్ల, మాధవరాయునిపల్లె, పెదుళ్లపల్లె, తిప్పరాజుపల్లె గ్రామాల రైతులు ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి వద్దకు వెళ్లి ఆన్‌లైన్ తొలగింపు విషయమై మొరపెట్టుకున్నారు. ఆయనెలాంటి పరిష్కార మార్గం చూపలేదు. ఈ నాలుగు గ్రామాల్లో దాదాపు 1200 ఎకరాల భూమిని ఆన్‌లైన్ నుంచి తొలగించి రైతులను ఇబ్బందులపాలు చేశారు. ఆన్‌లైన్‌లో తొలగించిన భూములు కింది స్థాయి అధికారులు యథావిధిగా చేసేందుకు అనుమతులు లేవని అధికారులు చెబుతున్నారని రైతులు వాపోతున్నారు.

బ్యాంకు ఒత్తిడి ఎక్కువైంది

ఈ నాలుగు గ్రామాల రైతులు వివిధ బ్యాంకుల్లో తమ పొలాలు తనఖా పెట్టి అధిక మొత్తంలో రుణాలు తెచ్చుకున్నారు. అయితే ఏటా రెన్యువల్ చేసుకుంటూ వస్తున్నారు. తమ భూములు ఆన్‌లైన్ నుంచి తొలగించడంతో బ్యాంకుకు వెళ్లి రెన్యువల్ చేసుకోవాలంటే భూముల ఆన్‌లైన్ పత్రం అడుగుతున్నారు. అది తీసుకువస్తామనుకుంటే భూములన్నీ ఆన్‌లైన్‌లో తొలగించారు. దీంతో ఏడాదిగా రైతులు బ్యాంకు వైపు కన్నెత్తి చూడడంలేదు. బ్యాంకు అధికారులు మాత్రం రోజూ ఇళ్ల వద్దకు వెళ్లి బకాయిలు చెల్లించాలంటూ రైతులను ఇబ్బందులు పెడుతున్నారు.

గ్రామసభలో అయినా మా సమస్యలు తీరేనా

కూటమి ప్రభుత్వం వచ్చాక ఇప్పటికే రెండు దఫాలుగా రెవెన్యూ గ్రామసభలు నిర్వహించారు. ఈ సభల్లో రైతుల భూ సమస్యలు పరిష్కరించి ఎలాంటి సమస్య లేకుండా చూడాలన్నదే ప్రభుత్వ ధ్యేయం. అయితే మండలంలో అందుకు విరుద్ధంగా భూములు ఆన్‌లైన్‌లో తొలగించడం, వాటిని తిరిగి ఎక్కించకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఉన్నతాధికారులు గమనించి మా భూములను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని వారు ప్రభుత్వాన్ని, అధికారులను వేడుకుంటున్నారు. ఈ విషయమై తహసీల్దారు మధునాయక్ వివరణ ఇస్తూ గతంలో తహసీల్దార్లు చేసిన నిర్వాకంతోనే ఆన్‌లైన్ నుంచి భూములు తొలగించారు. ప్రస్తుతం ఇది మా చేతుల్లో లేదు. ఉన్నతాధికారులకు తెలపడమే మా బాధ్యత వారి ఆదేశాల మేరకే తప్పకుండా ఆన్‌లైన్ కొనసాగిస్తామని ఆయన తెలిపారు.

600 ఎకరాలు ఆన్‌లైన్ నుంచి తొలగించారు



తిప్పరాజుపల్లె గ్రామం రెవెన్యూ పొలంలో దాదాపు 600 ఎకరాలు ఆన్‌లైన్ నుంచి తొలగించారు. గ్రామస్తులమంతా మూకుమ్మడిగా అధికారుల వద్దకు వెళుతున్నా వారు పట్టించుకోవడంలేదు. ఇప్పటికైనా మా భూములు మాకు గతంలో మాదిరిగానే ఆన్‌లైన్‌లో ఉండేలా చూస్తే మంచిది. బ్యాంకు అధికారులు రోజూఇంటి చుట్టూ తిరుగుతుండడం ఇబ్బందిగా ఉంది.

దుగ్గినేని సుబ్బరామయ్య, రైతు, తిప్పరాజుపల్లె

మా గ్రామాలపైనే కక్షగట్టారు



పాయలకుంట్ల పంచాయతీలో కామకుంట, వేమకుంట, ఏ.కొత్తపల్లె రెవెన్యూ గ్రామాల్లో దాదాపు 600 ఎకరాలు ఆన్‌లైన్ నుంచి తొలగించారు. మా నాలుగు గ్రామాలపైనే కక్షగట్టారు. అంతా వెళ్లి ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డిని అడిగినా ఆయన పట్టించుకోలేదు. మూడు తరాలుగా మేం భూములు సాగు చేసుకుంటున్నాం. ప్రస్తుత ప్రభుత్వం, అధికారులు మా సమస్యలు తీర్చాలని కోరుతున్నాం.

ఎల్.రాఘవరెడ్డి, రైతు, పాయలకుంట్ల

మల్లయ్యకొండకు రూ.6,64,916 ఆదాయం

- గతం కంటే పెరిగిన హుండీ ఆదాయం



హుండీ కానుకలను లెక్కిస్తున్న దేవదాయ శాఖ అధికారులు, భక్తులు

తంబళ్లపల్లె, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన భ్రమరాంబిక సమేత మల్లికార్జున స్వామి మల్లయ్యకొండకు భక్తులు హుండీలో సమర్పించిన కానుకల ద్వారా రూ.6,64,916లు ఆదాయం చేకూరినట్లు ఆలయ ఈఓ మునిరాజ తెలిపారు. మంగళవారం ఆలయంలో కూటమి నేతలు, ఈఓ, ఆలయ ఇన్‌స్పెక్టర్ శశికుమార్ ఆధ్వర్యంలో భక్తులు హుండీలో వేసిన కానుకలు లెక్కించారు. గతేడాది అక్టోబరు 30 నుంచి ఈ ఏడాది ఫిబ్రవరి 4వ తేదీ (3 నెలల 7 రోజులకు) వరకు వచ్చిన హుండీ కానుకలు లెక్కించగా ఈ ఆదాయం వచ్చినట్లు తెలిపారు. కొండ పైకి పూర్తి స్థాయిలో రోడ్డు సౌకర్యం ఉండడం, ప్రతి సోమవారం కొండ పైకి ఆర్టీసీ బస్సులు, ప్రైవేటు వాహనాలు తిరుగుతుండడంతో భక్తుల తాకిడి పెరుగుతున్నట్లు తెలిపారు. గతేడాది అక్టోబరు 30వ తేదీన(3 నెలల 20 రోజులకు) హుండీ ద్వారా రూ.5,94,257లు ఆదాయం వచ్చింది. కూటమి నేతలు ఉత్తమ్‌రెడ్డి, మల్లయ్యకొండ మాజీ చైర్మెన్ గంగుల్‌రెడ్డి, పార్లమెంట్ బీసీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి సోముశేఖర్, క్లస్టర్ ఇన్‌చార్జి బేరి శీన, మాజీ ఉప సర్పంచ్ మణి, సుధాకర్‌రెడ్డి, మ్యూజికల్ శివ, రామలింగారెడ్డి, కేశవరెడ్డి, క్రిష్టారెడ్డి, ఆలయ సిబ్బంది, గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

పెన్షన్ సొమ్ముతో రచ్చబండలు ఏర్పాటు

రాజంపేట, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): సుమారు 70 ఏళ్ల వయసులో కేతా చెంచురెడ్డికి ప్రభుత్వం ఇస్తున్న పెన్షన్‌ను పదిమందికీ ఉపయోగ పడేలా పనులు చేయిస్తున్నారు. సెన్సన్‌గా నాలుగు వేల రూపాయల పెన్షన్‌తో గ్రామ పరిసరాల్లో, ఆలయాల సముదాయల్లో, బస్ షెల్టర్ల వద్ద, రచ్చబండలు ఏర్పాటు చేస్తున్నారు. ఇలా పదికి పైబడి రచ్చ బండలు ఏర్పాటు చేసి అందరికీ ఆదర్శప్రాయమవుతున్నారు. వివరాల్లోకెళితే...

పుల్లంపేట మండలం కేతావాండ్లపల్లె(దిగువపల్లె గ్రామం) వాసి కేతా చెంచురెడ్డికి ప్రభుత్వం వృద్ధాప్య పెన్షన్ ప్రస్తుతం రూ.4 వేలు ఇస్తోంది. తనకు పదేళ్ల నుంచి ప్రభుత్వం ఇచ్చే ఈ పెన్షన్‌ను పది మందికి ఉపయోగపడేలా చేయాలన్నది ఆలోచన. చిన్నతనంలో ఎక్కడ వచ్చినా బోర్లు, గ్రామ చావిడిలు, రచ్చ బండలు ఉండేవి. అక్కడ పెద్ద పెద్ద చెట్లు ఉండేవి. అక్కడ గ్రామస్తులు అంతా కూర్చుని కబుర్లాడుకుంటూ కులాశాగా ఉండేవారు. పిడస తినడం, రచ్చబండ వద్దకు రావడం, ఆత్మీయులతో సరదాగా గడిపేవారు. ఈ రచ్చ బండలు గ్రామాల్లో ఐక్యతను తీసుకొస్తాయి. అయితే ప్రస్తుతం పుల్లంపేట - చిట్వేలి ఘాట్ రోడ్డు నట్టినడి అడవిలో అంబుల వీరయ్య ఆలయం ఉంది. ఇక్కడికి ఎందరో వస్తుంటారు. వారు కూర్చోవడానికి చిన్న బండ కూడా లేదు. అందుకే ఇక్కడ నేను పోగు చేసుకున్న పెన్షన్ సొమ్ము రూ.60 వేలతో మూడు నెలలుగా కష్టపడి ఇక్కడే ఉంటూ రచ్చబండ కట్టిస్తున్నా. సమీపం లో చుక్కనీరు లేకున్నా 10 కిలోమీటర్ల నుంచి ట్యాంకర్ల ద్వారా నీరు, సిమెంటు, ఇటుకలు, బండలు, మట్టి, రాళ్లను పోగు చేసుకుని ఆ అడవిలో రచ్చబండ నిర్మాణాన్ని పూర్తి చేశాడు. ఈ విషయమై అటువైపు వెళుతున్న ఆంధ్రజ్యో తి ఇంత అడవిలో రచ్చబండ నిర్మాణంపై చెం చురెడ్డితో మాట్లాడితే ఆయన చెప్పిన మాటలు ఆశ్చర్యాన్ని గొలిపాయి. ఇప్పటికే సుమారు 10కి పైబడి రచ్చబండలు కట్టించాను. పుల్లంపేట మండలం వేల్పులవారిపల్లె, కొమ్మనవారిపల్లె, అయ్యప్ప ఆలయం, తిమ్మయ్యగారిపల్లె, ఆంజనేయస్వామి గుడి, తుమ్మారెడ్డి తోపు ఇలా అనేక గ్రామాల్లో రచ్చబండలు కట్టించాను. ఏదో తను కష్టపడి సంపాదించిన సొమ్ముతో బిడ్డలు పంపే సొమ్ముతో పొట్ట పోసుకుంటున్నా ఈ పెన్షన్ సొమ్మును పది మందికీ ఉపయోగపడుతూ పది కాలాల పాటు పేరుండేలా ఈ రచ్చబండలు కట్టిస్తున్నా. ప్రభుత్వ సొమ్ముతో పది మందికి ఉపయోగపడే ఇలాంటి రచ్చబండలు ఎంతో బాగుంటాయన్నది నా ఆలోచన అంటూ తనదైనశైలిలో తన ఆనందాన్ని పంచుకున్నాడు చెంచురెడ్డి.



అడవిలో అంబుల వీరయ్య దేవాలయం వద్ద కేతా చెంచురెడ్డి కట్టిస్తున్న రచ్చబండ ఇన్‌సెట్‌లో చెంచురెడ్డి

గేటు మీద పడి విద్యార్థికి గాయాలు



పెద్దతిప్పసముద్రం ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాల విద్యార్థిపై గేటు పడడంతో గాయాల య్యాయి. పీటీఎం మండలం కందుకూరులో చోటుచేసుకున్న సంఘటనపై వివరాల్లో కెళితే.... కందుకూరు వాసి ముబారక్ కుమారుడు అబ్దుల్ మతీన్ (6) కందుకూరు ఎంపీపీ పాఠశాలలో 1వతరగతి చదువుకుంటున్నాడు. రోజు లాగా పాఠశాలకు వెళ్లాడు. పాఠశాల నుంచి ఇంటికి వచ్చే క్రమంలో ప్రధాన గేటు మీద పడడంతో విద్యార్థికిగాయాలయ్యాయి. విద్యార్థి తల్లిదండ్రులకు కనీస విషయం తెలపకుండా, విద్యార్థిని పాఠశాల ప్రధానోపాధ్యాయులు మరో విద్యార్థిని వెంట బెట్టి ఇంటికి పంపించేశాడని కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పిల్లలపై ఉపాధ్యాయులకు బాధ్యత లేదా అంటూ విద్యార్థుల తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. గాయపడిన విద్యార్థిని కుటుంబ సభ్యులు బి.కొత్తకోట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించినట్లు తెలిపారు. వైసీపీ ప్రభుత్వంలో నాడు -నేడు ద్వారా చేసిన పనులను నాసిరకంగా చేపట్టడంతోనే ఇలా ప్రమాదాలు జరుగుతున్నాయని కనీసం ఇప్పటికైనా ఇలాంటివి పునరావృత్తం కాకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.

మద్యం దరఖాస్తులకు నేడే చివరి రోజు



రైల్వేకోడూరు రూరల్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): గీత, ఉప కులాలకు కేటాయించిన మద్యం దుకాణాలకు దరఖాస్తు చేసేందుకు నేడే చివరి రోజు అని రైల్వేకోడూరు ఎక్సైజ్ సీఐ తులసి తెలిపారు. జిల్లాలో 11 మద్యం షాపులు రాయచోటి మున్సిపాలిటీ (గౌడ్), రాజంపేట మున్సిపాలిటీ (ఈడిగ), మదనపల్లి మున్సిపాలిటీ (ఈడిగ), రామసముద్రం (ఈడిగ), వీరబల్లి(ఈడిగ), బి.కొత్తకోట రూరల్ (గౌడ్), నిమ్మనపల్లి(ఈడిగ), తంబళ్లపల్లి (ఈడిగ), నందలూరు(గౌడ్), కలకడ (ఈడి గ), పీలేరు(గౌండ్ల) దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు పేర్కొన్నారు. ఏ షాపునకు దరఖాస్తు చేయదలచినా ఏ ఎక్సైజ్ స్టేషన్‌లో, ఆన్‌లైన్‌లో కూడా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

ఆరుగురు ఎర్రచందనం స్మగ్లర్ల అరెస్ట్

తొమ్మిది ఎర్రచందనం దుంగలు స్వాధీనం



పట్టుబడ్డ దుంగలు, స్మగ్లర్లతో ఫారెస్టు అధికారులు

వీరబల్లి, ఫిబ్రవరి4(ఆంధ్రజ్యోతి): వీరబల్లి ఫారెస్టు బీట్ పరిధిలో ఆరుగురు ఎర్రచందనం స్మగ్లర్లను అరెస్టు చేసి 9 ఎర్రచందనం దుంగలను టాస్క్‌ఫోర్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ హెడ్ సుబ్బరాయుడు ప్రత్యేక కార్యాచ రణ మేరకు టాస్క్‌ఫోర్సు ఎస్పీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో డీఎస్పీ బాలిరెడ్డి మార్గనిర్దేశకంలో ఆర్ఐ (ఆపరేషన్స్) సురేశ్‌కుమార్‌రెడ్డికి చెందిన ఆర్ఎస్ఐ లింగాధర్ టీం, ఎఫ్‌బీఓ అనిల్‌కుమార్‌తో కలిసి సోమవారం వీరబల్లి అటవీ ప్రాంతంలో కూంబింగ్ చేపట్టారు. వీరు ఆ ప్రాంతంలోని ఎంట్రీ ఎగ్జిట్ పాయింట్లను తనిఖీ చేసుకుంటూ వెళుతుండగా ఝరికోన వద్ద కొందరు ఎర్రచందనం దుంగలను మోసుకుని వెళుతూ కనిపించారు. వారిని చుట్టుముట్టే ప్రయత్నం చేయగా కొందరు పారిపోగా వెంబడించి ఆరుగురిని పట్టుకోగలిగామన్నారు. ఆ ప్రాంతంలో 9 ఎర్రచందనం దుంగలు లభించాయి. పట్టుబడిన వారిని తమిళనాడు రాష్ట్రానికి చెందిన వారిగా గుర్తించారు. దుంగలను తిరుపతి టాస్క్‌ఫోర్సు పోలీసు స్టేషన్‌కు తరలించారు. పారిపోయిన వారి కోసం ముమ్మరంగా గాలిస్తున్నారు. ఎస్ఐ ఎండీ రఫీ కేసు నమోదు చేశారు. డీఎస్పీలు శ్రీనివాసరెడ్డి, ఎండీ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను తమ పిల్లలుగా చూసుకోవాలి



సిద్దవరం కస్తూర్బా పాఠశాల సౌకర్యాలపై ఆరా తీస్తున్న డిప్యూటీ డైరెక్టర్ దేవరాజు

పెద్దమండ్యం, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి) విద్యార్థులను తమ పిల్లలాగా చూసుకోవాలని, వారి విద్యాభివృద్ధికి సమష్టిగా కృషి చేయాలని కస్తూర్బా బాలికల పాఠశాల డిప్యూటీ డైరెక్టర్ దేవరాజు సూచించారు. మండలంలో మంగళవారం కస్తూర్బా బాలికల పాఠశాల రాష్ట్ర డైరెక్టర్ దేవరాజు, జిల్లా జీసీడీఓ మధుమతి పర్యటించారు. సిద్దవరం కస్తూర్బా పాఠశాలలో మధ్యాహ్నం భోజనం తనిఖీ చేసి పాఠశాల సౌకర్యాలపై ప్రిన్సిపాల్ రాణికుమారిని అడిగి తెలుసుకున్నారు. కాగా విద్యార్థినులకు పురుగులు పటిన అన్నం పెడు తున్నారని, విద్యార్థినుల చేత మరుగుదొడ్లు కడిగిస్తున్నారని గతవారం వైరల్ అయిన ఫొటోలు డీఈఓ సుబ్రమణ్యం దృష్టికి వెళ్లాయి. ఈ వ్యహారంపై వివరణ కోరుతూ ప్రిన్సిపాల్‌కు డీఈఓ సోకాజ్ నోటీసు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ వెట్టిచాకిరి ఫొటోలు ఎప్పడు, ఎవరు తీశారు, ఎందుకు వైరల్ చేశారని అందరిలో చర్చనీయాంశమైంది. పెద్దమండ్యం మోడల్ స్కూల్ విద్యార్థులతో వారు మాట్లాడుతూ పది, ఇంటర్ పరీక్షల్లో విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధనకు సూచనలు ఇచ్చారు. ఎంఈఓలు మనోహర్, రామకృష్ణ, ప్రిన్సిపాల్ రామాంజులు నాయక్, అధ్యాపకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉరి వేసుకుని రైతు మృతి



నరసింహులు మృతదేహం (ఇన్‌సెట్‌లో ఫైల్‌ఫొటో)

మదనపల్లె అర్బన్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి):అనుమానాస్పద స్థితిలో చెట్టుకు ఉరివేసుకుని రైతు మృతి చెందడం సంచలనమైంది. పొన్నూటిపాళెంలో సోమవారం రాత్రి చోటు చేసుకున్న ఘటనపై తాలుకా సీఐ కళావెంకటరమణ తెలిపిన వివరాల్లోకెళితే... పిచ్చిలవారిపల్లె వాసి నరసింహులు(65) 20 ఏళ్లుగా తన భూమిలోకి వెళ్లడానికి అదే గ్రామానికి చెందిన కొందరు దారి ఇవ్వడంలేదని గొడవలు జరుగుతున్నాయి. ఇందులో భాగంగానే సోమవారం దారి సమస్య తీర్చాలని మదనపల్లె సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్‌కు స్పందనలో వినతిపత్రం అందజేశారు. విషయం తెలుసుకు న్న ప్రత్యర్థులు వారు పొలంలోకి పోకుండా సోమవారం సాయంత్రానికి అడ్డుగా వేశారు. ఏమి జరిగిందో ఏమో తెలియదు గానీ ప్రత్యర్థుల పొలంలోని పెద్ద చెట్టుకు ఉరేకుని మృతి చెందాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడం తో తాలుకా పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. మృతుని భార్య రెడ్డెమ్మ ఫిర్యాదు మేరకు తాలుకా సీఐ అనుమానాస్పద స్థితి కేసు నమోదు చేసిదర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. మృతునికి ఒకకూతురు, ఇద్దరు కుమారులు ఉన్నారు.

సకల దేవతలకు ఆహ్వానం

- ధ్వజారోహణంతో ప్రారంభమైన వెంకన్న బ్రహ్మోత్సవాలు
- వైభవంగా స్వామి, అమ్మవార్లకు పల్లకీ ఉత్సవం



పల్లకీ సేవలో స్వామి వారు

తంబళ్లపల్లె, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): సకల దేవతలకు ఆహ్వానం పలుకుతూ ధ్వజారోహణతో ప్రసన్న వేంకటరమణ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. కోసువారిపల్లెలో కొలువైన ప్రసన్న వేంకటరమణ స్వామి ఆలయంలో మంగళవారం ఉదయం వేద పండితులు ఆలయ ధ్వజస్తంభం పైకి గరుడ ధ్వజాన్ని శాస్త్రోక్తంగా ఎగురవేశారు. వేకువనే సుప్రభాతంతో స్వామి వారిని మేల్కొలిపి ధూప, దీప నైవేద్యాలు సమర్పించి నిత్య కైంకర్యాలు పూర్తిచేశారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత వేంకటరమణ స్వామి ఉత్సవమూర్తుల సమక్షంలో వేదపండితుల మంత్రోచ్చారణలు, భక్తుల గోవింద నామస్మరణ మార్మోగింది. సకల దేవతలు, అష్టదిక్పాలకులు, సప్తమాత్రుకలు, ప్రాణకోటిని బ్రహ్మోత్సవాలకు ఆహ్వానించేందుకు ధ్వజారోహణం ఘట్టం నిర్వహిస్తారని ప్రాశస్త్యం. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత స్వామి వారి ఉత్సవర్లకు పాలు, పెరుగు, తేనే, కొబ్బరినీళ్లు, పసుపు, చందనంతో వేడుకగా స్నపనతిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాల నడుమ శ్రీదేవి, భూదేవి సమేత స్వామి వారికి పల్లకీ ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం శేషవాహన సేవ, రా త్రి హంసవాహన సేవలు నిర్వహించనున్నారు. సూపరింటెండెంట్ మునిబాలకుమార్, వేదపండితులు పాల్గొన్నారు.

రైలు కింద పడి ఆత్మహత్య

చంద్రగిరి, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): రైలు కిందపడి రవికుమార్‌యాదవ్(58) ఆత్మహత్య చేసు కున్నాడు. గుర్రంకొండ మండలం అరిగివారిపల్లెకు చెందిన రవికుమార్‌యాదవ్ మంగళవారం సాయంత్రం వెంటాద్రి ఎక్స్‌ప్రెస్ రైలు వస్తుండగా పట్టాలపై పడుకున్నాడు. పోలీసులు వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. మృతదేహం నుజ్జు నుజ్జు అవ్వడంతో రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. మృతుడు బంధువులు రవి కనబడడంలేదని గాలిస్తున్నారు. సెల్‌ఫోన్ సిగ్నిల్స్ ఆధారంగా శ్రీనివాసమంగాపురం చేరుకున్నారు. రవి ఆత్మహత్యకు కారణాలు తెలియలేదు.

పారదర్శకంగా పరిష్కరించాలి

రెవెన్యూ సదస్సు అర్జీలను వెంటనే పరిష్కరించండి : రెవెన్యూ అధికారులతో కలెక్టర్ చామకూరి శ్రీధర్



బ్రాహ్మణపల్లె వద్ద భూములను పరిశీలిస్తున్న కలెక్టర్ శ్రీధర్, సబ్‌కలెక్టర్ నిదియాదేవి

రాజంపేట, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నెల రోజులు నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన అర్జీలను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఆదేశించారు. మంగళవారం రాజంపేట ఎంపీడీఓ కార్యాలయంలో రెవెన్యూ, ఇతర అధికారులతో సబ్‌కలెక్టర్ నిధియాదేవితో కలిసి సమీక్షించిన ఆయన మాట్లాడుతూ రెవెన్యూ సదస్సుల్లో 200 దరఖాస్తులు అందాయని వీటిని వెంటనే పరిష్కరించాలన్నారు. భూవివాదాలపై 26 వినతిపత్రా లు అందాయని, వీటిని పారదర్శకంగా పరిష్కరించాలన్నారు. అన్నదమ్ములు, సరిహద్దు, మ్యుటేషన్స్ సమస్యలపై ఎక్కువ అర్జీలు అందాయని వాటిని పారదర్శకంగా పరిష్కరించాలన్నారు. నిక్కచ్చిగా పనిచేసేటప్పు డు ఒత్తిడులు రావడం సహజమని, అంతమాత్రాన అధైర్యపడకుండా నిబంధనల మేరకు పని చేయాలన్నారు. సమష్టిగా పనిచేసినప్పుడే సమస్యను పరిష్కరించవచ్చునని, ఎక్కువ ఒత్తిడి ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే వెనువెంటనే పరిష్కరిస్తామన్నారు.

బ్రాహ్మణపల్లె భూములు పరిశీలన

బ్రాహ్మణపల్లె సర్వేనంబరు 101/3లో అందిన మ్యుటేషన్ సమస్యను క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి ఈ సమస్యను అక్కడికక్కడే పరిష్కరించారు. కార్యక్రమంలో తహసీల్దారు పీర్‌మున్నీ, ఎంపీడీఓ వరప్రసాద్‌రావు, వీఆర్వోలు, సర్వేయర్‌లు పాల్గొన్నారు.

విద్యార్థులకు అనుకూలంగా పునర్‌వ్యవస్థీకరణ

విద్యార్థులకు అనుగుణంగా పాఠశాలల పునర్ వ్యవస్తీకరణను చేపట్టాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ విద్యాశాఖాధికారులను ఆదేశించా రు. రాజంపేట ఎంపీడీఓ కార్యాలయంలో రాజంపేట, నందలూరు మండల ఎంఈఓలు, ప్రధానోపాధ్యాయులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పాఠశాలల పునర్‌వ్యవస్తీకరణ కారణంగా ఏ విద్యార్థి నష్టపోకుండా భవిష్యత్‌లో కూడా వారికి ఉపయోగ పడేవిధంగా పాఠశాల పునర్‌వ్యవస్తీకరణ ప్రక్రియను చేపట్టాలన్నారు. విద్యార్థులకు, ఉపాధ్యాయులకు ఎటువంటి ఇబ్బంది లేకుం డా చేపట్టాలన్నారు. విద్యార్థులు పాఠశాలలకు వచ్చే రాకపోకలు, సౌకర్యాలను దృష్టిలో పెట్టుకుని అదేవిధంగా ఉపాధ్యాయులకు ఎటువంటి నష్టం జరగకుండా అందుబాటు లో ఉండే భవనాలు, ఇతర మౌలిక వసతులు వృథా కాకుండా వాటిని పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకునేలా పునర్‌వ్యవస్తీకరణ నిర్వహించాలన్నారు.

రీసర్వే పనులు పూర్తిచేయాలి : కలెక్టర్

రాయచోటి (కలెక్టరేట్), ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): మండల సర్వేయర్లు ప్రత్యేక దృష్టి సారించి పెండింగ్‌లో ఉన్న రీసర్వే పనులను పూర్తి చేయాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో తహసీల్దార్లు, ఎంపీడీఓలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రీ సర్వే, రెవెన్యూ సదస్సుల అర్జీలు, పీజీఆర్ఎస్ అర్జీలు, భూసేకరణ తదితర అంశాలపై సమీక్షించిన కలెక్టర్ మాట్లాడుతూ రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన అర్జీలు, పీజీఆర్ఎస్ ద్వారా వచ్చిన అర్జీలను త్వరగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. చాలా మండలాల్లో రెవెన్యూ సదస్సుల ద్వారా వచ్చిన అర్జీలు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని త్వరగా పరిష్కరించాలని సూచించారు. రీసర్వే గురించి మాట్లాడుతూ మండల సర్వేయర్లు అందరూ దృష్టి సారించి పెండింగ్‌లో ఉన్న రీసర్వే పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. సబ్‌కలెక్టర్లు, ఆర్డీఓను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రతి వారం ఎంపీడీఓలు, తహసీల్దార్లతో ఈ అంశాలపై సమీక్ష నిర్వహించి పురోగతి సాధించాలన్నారు. సమావేశంలో సంయుక్త కలెక్టర్ ఆదర్శరాజేంద్రన్, డీఆర్ఓ మధుసూదనరావు, సబ్ కలెక్టర్లు, ఆర్డీఓ, సర్వే శాఖ ఏడీ, తహసీల్దార్‌లు, ఎంపీడీఓలు తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురిపై కేసులు నమోదు

చాపాడు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని విశ్వనాథపురం గ్రామానికి చెందిన భాస్కర్‌రెడ్డి, అతని భార్య, కొడుకు శివారెడ్డిపై కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. వివరాల మేరకు.. కుచ్చుపాప గ్రామం వద్ద భాస్కర్‌రెడ్డి, పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన సూర్యనారాయణరాజు కలిసి మైదుకూరు మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి వద్ద సుమారు 40 ఎకరాల భూమిని కౌలుకు తీసుకున్నారు. ఈభూమిలో రొయ్యలు పెంపకం చేపట్టారు. ఈ నేపథ్యంలో వీరిద్దరి మధ్య మనస్పర్థలు రావడంతో భూమిలోని చెరువును చెరిసగం పంచుకున్నారు. మంగళవారం సూర్యనారాయణరాజు తనకు చెందిన చెరువులోని రొయ్యలను వ్యానులో ప్రొద్దుటూరు పట్టణానికి తీసుకుపోతుండగా భాస్కర్‌రెడ్డి, అతని భార్య, కొడుకు శివారెడ్డి అడ్డుకున్నారు. తమకు ఇవ్వాల్సిన పాత బాకీ రూ.లక్ష ఇవ్వాలని సూర్యనారాయణ రాజును నిలదీయడంతో వీరి మధ్య వాగ్వాదం జరిగింది. ఈ నేపథ్యంలో శివారెడ్డి ఆగ్రహంతో సూర్యనారాయణరాజును కొట్టాడు. ఈ మేరకు పై ముగ్గురిపై కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

బీటెక్ విద్యార్థిని ఆత్మహత్య



ప్రొద్దుటూరు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు మండలం నంగనూరుపల్లెకు చెందిన మేకల వైష్ణవి (19) అనే విద్యార్థిని ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసుల వివరాల మేరకు.. చాపాడు మండలం పల్లవోల వద్ద ఉన్న ఓ ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ రెండో సంవత్సరం చదువుతున్న వైష్ణవి నెలసరి కడుపు నొప్పితో తరుచూ బాధపడుతుండేది. ఎక్కడికి వెళ్లినా నొప్పి తగ్గకపోవడంతో మంగళవారం ఉదయం ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. వైష్ణవి తల్లి లావణ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు రూరల్ పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఉద్యోగి మృతి



వేంపల్లె, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నందిపల్లె సమీపంలో కడప-పులివెందుల రోడ్డులో జరిగిన ప్రమాదంలో రమేష్‌యాదవ్ (38) అనే ఐటీఐ ఉద్యోగి మృతి చెందాడు. వేములకు చెందిన శ్రీనివాసులు కుమారుడు రమేష్‌యాదవ్ వేముల ప్రభుత్వ ఐటీఐలో కాంట్రాక్టు పద్ధతిలో ఆఫీస్ సబార్డినేట్‌గా పనిచేస్తున్నారు. పెండ్లిమర్రి మండలం తిప్పరాజుపల్లెకు చెందిన శోభారాణితో పదేళ్లక్రితం వివాహమైంది. వీరికి ఏడాది వయసున్న పాప ఉంది. అత్తగారి ఊరైన తిప్పరాజుపల్లెలో నివాసముంటూ వేముల ఐటీఐకి వెళ్లి వచ్చేవాడు. రోజు మాదిరిగానే మంగళవారం రాత్రి వేముల నుంచి తిప్పరాజుపల్లెకు బైకులో వెళ్తుండగా నందిపల్లె వద్ద ట్రాక్టర్‌ను ఢీకొనడంతో తలకు గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. సీఐ సురేష్‌రెడ్డి, ఎస్ఐలు వివరాలు సేకరించారు.

వ్యక్తిపై ఆటోడ్రైవర్ కత్తితో దాడి

బద్వేలు టౌన్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఆర్టీసీ బస్టాండులో ఖాజారసూల్ అనే వ్యక్తిని ఆటోడ్రైవర్ కత్తితో పొడిచిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. ఆటోలో బస్టాండుకు వచ్చిన ఖాజారసూల్‌ను ఆటోడ్రైవర్ డబ్బులు అడగగా ఇప్పుడు లేదు తరువాత ఇస్తాననడంతో ఇద్దరికి మాటామాటా పెరిగింది. దీంతో ఆటోడ్రైవర్ ఆటోలో ఉన్న కత్తితీసుకొని ఖాజారసూల్ పొట్టలో పొడిచాడు. వెంటనే స్థానికులు గాయపడిన వ్యక్తిని ఆటోలో ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం కడప రిమ్స్‌కు తరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ద్వారకానగర్‌లో చోరీ

ప్రొద్దుటూరు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): గోపవరం మండలం ద్వారకానగర్‌లో రమణయ్య అనే వ్యక్తి ఇంట్లో సోమవారం రాత్రి 10 గంటలకు చోరి జరిగింది. రూరల్ ఎస్ఐ సురేష్ వివరాల మేరకు.. రమణయ్య బంధువులకు సంబంధించి దినకర్మ వుండటంతో సోమవారం ప్రొద్దుటూరు టౌన్‌కు కుటుంబ సమేతంగా వెళ్లారు. రాత్రి 10 గంటలకు ఇంటికి తిరిగి రాగా తలుపు తెరిచి వుండటంతో ఇంట్లోకి వెళ్లగా.. అప్పుడే ముగ్గురు వ్యక్తులు పరారయ్యారని తెలిపారు. ఇంట్లో బీరువాను పరిశీలించి బంగారు వస్తువులు పోయినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు విచారిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

తెల్లార్లు ఇంటిల్లిపాది కష్టపడినా కనీసం కూలీ కూడా గిట్టు బా టు కావడం లేదు... ఎన్ని ప్రభుత్వాలు మారుతున్న మా బతుకులు మాత్రం మారడం లేదు. ఎన్నికల సమయంలో మాత్రం నాయకులు అది చేస్తాం.. ఇది చేస్తాం అని చెబుతారు.. ఆ తర్వాత ఇటు వైపు కన్నెత్తి చూడరు.. ఏళ్లు గడుస్తున్నా మాకు కష్టాలు కన్నీళ్లు తప్పడం లేదు.. ఇది చేనేత కార్మికుల ఆవేదన.



గుంతమగ్గంలో నేత నేస్తున్న కార్మికుడు



పవర్‌లూమ్ మగ్గం నేస్తున్న నేత కార్మికుడు

దుర్భరంగా... చేనేతల బతుకులు

- ఇంటిల్లిపాది కష్టపడినా కూలి కూడా పడటం లేదని ఆవేదన
- గిట్టుబాటు ధర కల్పించాలి
- పెరిగిన ధరలకు అనుగుణంగా పనిముట్లు అందించాలి
- చేనేత సంఘాల నాయకుల డిమాండ్

జమ్మలమడుగు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): చేనేత పరిశ్రమ దుర్భరస్థితిలో ఉంది. ప్రస్తుతం చేనేతలకు గడ్డుకాలం ఏర్పడిందని... కరోనా సమయం నుంచి ఇప్పటి వరకు చేనేతలపై ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని పలువురు చేనేత సంఘాల నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల సమయంలో ఓట్లకు మాత్రమే చేనేతలను ఉపయోగించుకుని తర్వాత ఆ పరిశ్రమ పట్లకానీ, కార్మికుల సమస్యలను పట్టించుకోవడం లేదంటున్నారు. ప్రస్తుతం (గత నాలుగు నెలల నుంచి) పట్టు కిలో వెయ్యి రూపాయలు ధర పెరిగిందని, గతంలో రూ.4,400 ఉంటే ఇటీవల రూ.5,500లకు ధర పెరిగింది. దీంతో పట్టు నేత కార్మికులకు ఇంటిల్లిపాది కష్టపడినా గిట్టుబాటు ధర లేదని నేతన్నలు వాపోతున్నారు. ఇక కాటన్ (నూలు) ఒక లడిగె రూ.75 ధర ఉంది. ఒక చీరెకురెండు లడిగెల ఒక కట్టు ఖర్చు అవుతుంది. అయితే చేనేతలకు ఇచ్చే కూలి ఒక చీరెకు రూ.120 మాత్రమే రకాన్ని బట్టి ఉందని తెలిపారు. దీంతో తెల్లార్లు ఇంటిల్లిపాది కష్టపడినా కనీసం కూలి కూడా గిట్టుబాటు కావడం లేదని చేనేత కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తు న్నారు. దీంతో ప్రస్తుతం పెరిగిన నిత్యావసర సరుకుల ధరలకు ఏమి కొనలేక, తినలేక ఇబ్బంది పడుతున్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం సబ్సీడీ ధరలకు అవసరమైన పనిముట్లు అందించి ఆదుకోవాలని చేనేతలు, నేత కార్మిక నాయకులు కోరుతున్నారు.

గిట్టుబాటు ధరకు ఉత్పత్తులు కొనేలా చూడాలి

చేనేత పరిశ్రమలో నేసిన ఉత్పత్తులను ఆప్కోసంస్థ ద్వారా గిట్టుబాటు ధరకు ఉత్పత్తులు కొనేలా చూడాలని చేనేత సంఘాల నాయకులు కోరుతున్నారు. అలాగే సబ్సిడీకి పనిముట్లు, పాస్‌పుస్తకాలు తదితరాలు అందించాలని, ఉచిత బీమాతో పాటు ఆరోగ్యబీమా సౌకర్యం కల్పించాలని కోరుతున్నారు. ఇక కేంద్ర ప్రభుత్వం నేతన్నలకు, వారి అభివృద్ధి కోసం పరిశ్రమ ముందుకు వెళ్లాలంటే జీఎస్టీ రద్దు చేయాలని కోరుతున్నారు. జీఎస్టీ పెట్టినప్పటి నుంచి చేనేత పరిశ్రమ పూర్తిగా దెబ్బతిందని.. ధరలు పెరిగి జీఎస్టీ కట్టలేక పెట్టుబడులు లేక మాస్టర్ వీవర్స్ ఇబ్బందులు పడుతున్నారు. చేసేది లేక కొందరు అదే పరిశ్రమపై ఊగిసలాడుతూ ఇబ్బందులు పడుతున్నారు. గత ప్రభుత్వంలో చేనేత కార్మికునికి నేతన్న నేస్తం కింద ఏడాదికి రూ.24 వేలు ఇచ్చేదని.. కూటమి ప్రభుత్వం ఆదిశగా పెంచి ఇవ్వాలని కోరుతున్నారు. చేనేత కార్మిక రంగానికి కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు 200 యూనిట్లు ఉచిత విద్యుత్తు అమలు చేయాలని కోరుతున్నారు.

చేనేత పరిశ్రమను ఆదుకోవాలి



చేనేత పరిశ్రమ సంక్షోభంలో ఉంది. కార్మికులకు సక్రమంగా పనిలేక కొందరు వేరే వృత్తులోకి మారడం, మరికొందరు చేనేత రంగం వదిలి వెళ్లలేక ఇబ్బంది పడుతున్నారు. ప్రస్తుత ప్రభుత్వాలు చేనేత కార్మికులను ఆదుకునేందుకు సబ్సిడీకి పనిముట్లు ఇవ్వాలి. జీఎస్టీ రద్దు చేయడంతో పాటు సంక్షేమ పథకాలు అమలు చేయాలి. ఉత్పత్తులను ప్రభుత్వమే కొనుగోలు చేయాలి. ఉచిత విద్యుత్తు వెంటనే అమలు చేయాలి. నూలు, పట్టు ధరలు తగ్గించాలి.

- కొటా రామదాసు,
చేనేత ఐక్యవేదిక జాతీయ ఉపాధ్యక్షుడు

క్యాన్సర్ రాకుండా అప్రమత్తంగా ఉండాలి

కడప కలెక్టరేట్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): క్యాన్సర్ ప్రమాదకరమైన వ్యాధి అని, అది మన దరిదాపులకు రాకుండా అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ నాగరాజు పిలుపునిచ్చారు. మంగళవారం ప్రపంచ క్యాన్సర్ దినం సందర్భంగా డీఎంహెచ్ఓ కార్యా లయంలో వైద్యాధికారులు, సిబ్బందికి సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా డీఎంఅండ్‌హెచ్ఓ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం క్యాన్సర్ నివారణకు అనేక చర్యలు చేపడతోందన్నారు. ఇంటివద్దనే అందరికీ ఆరోగ్యం అందించాలనే దృక్పథంతో ఎన్‌సీడీ 3.0 సర్వే ద్వారా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో, పట్టణ ఆరోగ్య ప్రాథమిక కేంద్రాల వైద్యాధికారులతో, ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్ఎంలకు క్యాన్సర్ స్క్రీనింగ్‌పై శిక్షణ ఇచ్చామన్నారు. 18 సంవత్సరాలు పైబడిన స్త్రీ, పురుషులకు ఇంటింటా క్యాన్సర్, సర్వే కార్యక్రమం నిర్వహించామన్నారు. ప్రతి స్త్రీకి రొమ్ము క్యాన్సర్, 30 ఏళ్లు పైడిన మహిళలకు గర్భాశయం ముఖ ద్వారం పరీక్షలు, నోటి క్యాన్సర్‌తో పాటు రక్తపోటు వంటి వ్యాధులకు ఉచితంగా రక్త, ఆరోగ్య పరీక్షలు చేశామన్నారు. మంగళ, గురువారం రోజుల్లో స్పెషలిస్ట్ డాక్టర్లతో క్యాన్సర్ వ్యాధి రాకుండా అప్రమత్తం చేస్తున్నామన్నారు. ఆహారపు అలవాట్లు, జీవనశైలి, వ్యాయామంపై ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో డీఐఓ డాక్టర్ ఉమామహేశ్వరరావు, డీపీఎంఓ డాక్టర్ శశిభూషణరెడ్డి, డీఎల్ఏటీఓ డాక్టర్ సగిలి రవిబాబు, వైద్యాధికారులు, సూపర్‌వైజర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న డీఎంహెచ్ఓ డాక్టర్ నాగరాజు, వైద్యసిబ్బంది

విస్తరణ సేవలను రైతులకు అందించాలి

సికెదిన్నె, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): కృషి విజ్ఞాన కేంద్రం విస్తరణ సేవలను రైతులకు అందించాలని ఆచార్య ఎన్జీరంగా విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకులు డాక్టర్ జి.శివనారాయణ తెలిపారు. కృషి విజ్ఞాన కేంద్రంలో జరుగుతున్న శాస్త్రీయ సలహా మండలి సమావేశానికి మంగళవారం ఆయన హాజరై మాట్లాడుతూ వ్యవసాయ రంగం సంక్షోభంలో ఉందని, వాతావరణంలో మార్పులకు అనుగుణంగా తట్టుకునే రకాలు, సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవడం కోసం ప్రభుత్వం కృషి విజ్ఞాన కేంద్రం ఏర్పాటు చేసిందన్నారు. కేవీకేలు రైతుల స్థితిగతులను మార్చడానికి ఎంతగానో తోడ్పడుతాయని.. రైతులకు పరిజ్ఞానం పెంచడానికి అనేక శిక్షణ కార్యక్రమాలు, సాంకేతిక కార్యక్రమాలను వివిధ దత్తత గ్రామాల్లో ఆచరించడం జరుగుతుందన్నారు. తిరుపతి ప్రాంతీ య వ్యవసాయ పరిశోధన స్థానం సహ పరిశోధన సంచాలకు లు డాక్టర్ వి.సుమతి మాట్లాడుతూ రైతులు ఎదుర్కొంటున్న సమస్య లు, వ్యవసాయం, అనుబంధ సంఘాల అధికారుల నుంచి వచ్చే సలహాలు ఆధారంగా రాబోయే సంవత్సరానికి కార్యాచరణను, ప్రణాళికలను సిద్ధం చేసుకోవడానికి ఈ కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. అనంతరం కేవీకే సమన్వయకర్త వీరయ్య, ఏరువాక సమన్వయకర్త అంకయ్యకు మార్‌లు 2024-25 సంవత్సరానికి గాను సాధించిన ప్రగతిని, విస్తరణ సేవలను వివరించారు. కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా వ్యవసాయశాఖ అధికారి చంద్రానాయక్, పశుసంవర్ధకశాఖ అధికారి గుణశేఖర పిళ్లై, పులివెందుల అరటి పరిశోధన ప్రధాన శాస్త్రవేత్త శివరామకృష్ణ, వనిపెంట కేవీకే సమన్వయకర్త బాలకృష్ణ, వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త ప్రభాకర్‌రెడ్డి, రైతు శిక్షణ కేంద్రం సహా య సంచాలకులు రమణారెడ్డి, పలువురు శాస్త్రవేత్తలు, రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విస్తరణ సంచాలకులు డాక్టర్ శివనారాయణ

ఎస్ఏఆర్‌టీహెచ్ఐ కోఆర్డినేటర్‌గా డాక్టర్ రెడ్డయ్య

కడప ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): వైవీయూలోని కంప్యూటర్ సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ బి.రెడ్డయ్యను ఎస్ఏఆర్‌టీహెచ్ఐ (స్టూడెంట్స్ అంబాసిడర్ ఫర్ అకాడమిక్ రీ ఫార్మ్స్ ఇన్‌ట్రాన్స్‌ఫార్మింగ్ హయ్యర్ ఎడ్యుకేషన్) కోఆర్డినేటర్‌గా నియమించారు. విశ్వవిద్యాలయంలోని వీసీ చాంబర్‌లో డాక్టర్ రెడ్డయ్యకు ఉపకులపతి ఆచార్య కె.కృష్ణారెడ్డి, కులసచివులు ఆచార్య పి.పద్మ, ప్రధానాచార్యులు ఎస్.రఘునాథరెడ్డితో కలిసి నియామకపు పత్రాన్ని అందించారు. ఎస్ఏఆర్టీహెచ్ఐ సహాయకులుగా వైవీయూ బీసీడీఈ కోఆర్డినేటర్ వీసీ సంపత్‌కుమార్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. జాతీయ విద్యావిధానం-2020 పట్ల విద్యార్థులకు అవగాహన కల్పించడంతో పాటు విస్తృత ప్రచారంలోకి తీసుకెళ్లేలా చూడాలని అధికారులు కోరారు.

రిమ్స్‌లో ఎంబాల్వింగ్ మిషన్

కడప సెవెన్ రోడ్స్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): డిపార్ట్‌మెంట్ ఆఫ్ అనాటమీ ప్రభు త్వ మెడికల్ కళాశాలలో నూతనంగా ఎంబాల్వింగ్ మిషన్‌ను ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.సురేఖ మంగళవారం ఆవిష్కరించారు. ఈ మిషన్‌ను ఉపయోగించి శరీరంలోకి రసాయనాలను పంపిస్తారు. దీని ద్వారా మానవ శరీరాలను భద్రపరిచి ఎంబీబీఎస్ విద్యార్థులకు ప్రాక్టికల్స్‌కు ఉపయోగిస్తారు. ఈ మిషన్‌ను శాంక్షన్ చేయించినందుకు ప్రిన్సిపల్‌కి అనాటమీ విభాగాధిపతి డాక్టర్ సి.యామినిదేవి కృతజ్ఞతలు తెలిపారు. కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ విజయభాస్కర్‌రెడ్డి, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సునీల్, అనాటమీ డిపార్ట్‌మెంట్ సిబ్బంది, ఎంబీబీఎస్ మొదటి సంవత్సర విద్యార్థులు పాల్గొన్నారు.



ఎంబాల్వింగ్ మిషన్‌ను ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్

డ్రాగా ముగిసిన ఆంధ్ర - హిమాచల్ ప్రదేశ్ మ్యాచ్

కడప స్పోర్ట్స్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): కడప రిమ్స్ సమీప వైఎస్ రాజారెడ్డి ఏసీఏ క్రికెట్ స్టేడియంలో జరుగుతున్న కల్నల్ సీకేనాయుడు ట్రోఫీ (అండర్ 23) నాలుగు రోజుల క్రికెట్ మ్యాచ్ మంగళవారం డ్రాగా ముగిసింది. ఓవర్ నైట్ స్కోరు 30 పరుగులతో తిరిగి రెండో ఇన్నింగ్స్‌కు దిగిన ఆంధ్రజట్టు ఆటకు చివరిరోజైన మంగళవారం తన రెండో ఇన్నింగ్స్‌లో 55.3 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 203 పరుగులు చేసింది. ఓవర్‌నైట్ స్కోరు 19 పరుగులతో నాటౌట్‌గా నిలిచిన రేవంత్‌రెడ్డి తిరిగి బ్యాటింగ్ ప్రారంభించి 47 పరుగుల వద్ద ఔట్ అయ్యారు. దీంతో ఆంధ్ర జట్టు తన మొదటి ఇన్నింగ్స్‌లో 544, రెండో ఇన్నింగ్స్‌లో 203 పరుగులు మొత్తంగా రెండు ఇన్నింగ్స్‌లకు కలిపి 747 పరుగులు చేసింది. ఇందుకు ధీటుగా హిమాచల్‌ప్రదేశ్ జట్టు తన మొదటి ఇన్నింగ్స్‌లో 436 పరుగులు చేయగా.. చివరి రోజు తిరిగి రెండో ఇన్నింగ్స్ చేపట్టి 22.3 ఓవర్లలో ఒక వికెట్ నష్టపోయి 92 పరుగులు చేసింది. ఇందులో యోగ్‌దీప్ ఠాకూర్ 69 పరుగులు చేశారు. దీంతో నిర్వాహకులు మ్యాచ్‌ను డ్రాగా ప్రకటించారు. కాగా మొదటి ఇన్నింగ్స్‌లో ఆంధ్రజట్టుకు ఆధిక్యత లభించింది.

నిత్యాన్నదాన పథకానికి రూ.50వేలు వితరణ

చక్రాయపేట, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): గండి క్షేత్రంలో జరిగే శాశ్వత నిత్యాన్నదాన పథకానికి ప్రొద్దుటూరుకు చెందిన అర్షల వెంకటరెడ్డి, ఆదిలక్షుమ్మ, కుటుంబ సభ్యులు మంగళవారం నిత్యాన్నదాన పథకానికి రూ.50,116 విరాళంగా ఇచ్చారు. విరాళాన్ని సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్యకు అందించారు. ప్రధాన అర్చకులు కేసరి, మాజీచైర్మన్ వెంకటస్వామి పాల్గొన్నారు.

జడ్పీ సర్వసభ్య సమావేశం వాయిదా

కడప రూరల్, ఫిబ్రవరి 4: పార్లమెంట్ సమావేశాలు ఉన్న సందర్భంగా ఈ నెల 7న నిర్వహించాల్సిన జడ్పీ సర్వసభ్య సమావేశాన్ని 8వ తేదీ శనివారం సెలవు రోజు నిర్వహిస్తున్నామని జడ్పీ సీఈవో సి.ఓబులమ్మ తెలిపారు. ఈ మార్పును ప్రజాప్రతినిధులు, అధికారులు గమనించి సర్వసభ్య సమావేశానికి హాజరు కావాలని కోరారు.

మహానాడు కోసం స్థల పరిశీలన

(కడప - ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న మహానాడు కార్యక్రమాన్ని ఈసారి కడపలో నిర్వహించాలని ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధ్యక్షతన జరిగిన పొలిట్ బ్యూరో సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. మే 27, 28, 29 తేదీల్లో మహానాడు నిర్వహించనున్నారు. డీఆర్‌సీ సమావేశంలో పాల్గొనేందుకు జిల్లాకు వచ్చిన ఇన్‌చార్జ్ మంత్రి సవిత పొలిట్ బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డి, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అమీర్‌బాబు, ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి, ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణ చైతన్యరెడ్డిలు కలిసి మహానాడు నిర్వహణకు మంగళవారం స్థలాన్ని పరిశీలించారు. రింగురోడ్డులోని జయరాజ్‌గార్డెన్ సమీపంలో, పులివెందుల రోడ్డులో, ఎయిర్‌పోర్టు పక్కనున్న మూడు చోట్ల స్థలాలను పరిశీలించారు. మహానాడుకు ఏపీ తెలంగాణ నుంచి కాక అండమాన్ నికోబార్, చెన్నై, కర్ణాటక ఇతర ప్రాంతాల నుంచి పెద్దఎత్తున పార్టీ నేతలు, కేడరు తరలివస్తుంది. సభ నిర్వహణ అనంతరం మీటింగ్, వాహన పార్కింగ్‌కు పెద్ద ఎత్తున స్థలం అవసరం అవుతుంది. ఈ నేపథ్యంలో మూడుచోట్ల స్థలాలను పరిశీలించారు. ఇంకా ఏదీ ఫైనల్‌గా నిర్ణయించలేదు.

పార్టీ కోసం కష్టపడ్డ కార్యకర్తలను ఆదుకోండి

టీడీపీ గెలుపు కోసం అహర్నిశలు జెండా మోసిన కార్యకర్తలను ఆదుకోవాలంటూ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి సవితకు పలువురు టీడీపీ నేతలు విజ్ఞప్తి చేశారు. డీఆర్‌సీ సమావేశంలో పాల్గొనేందుకు కడపకు వచ్చిన ఆమె కలవాల్సిందిగా కడప నగరంలో ఉన్న పలువురు టీడీపీ నేతలకు ఫోను చేశారు. దీంతో కొందరు విడివిడిగా కలిసి వారి సమస్యలను ఏకరువు పెట్టారు. మంగళవారం ఆర్అండ్‌బీ అతిథిగృహంలో పలువురు కడప టీడీపీ నేతలు కలిశారు. టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వీఎస్ అమీర్‌బాబు, రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు ఎస్.గోవర్ధనరెడ్డి, హరిప్రసాద్, నగర అధ్యక్షుడు సానపురెడ్డి శివకొండారెడ్డి, అలంఖాన్‌పల్లెకు చెందిన టీడీపీ నేతలు లక్ష్మిరెడ్డి, మన్మోహన్ రెడ్డి, వీరయ్య తదితరులు మంత్రిని కలిశారు. అయితే వీరిలో కొందరు తాము పార్టీ కోసం కష్టపడినా గుర్తింపు లేదని, ఇసుక మాఫియా, మట్టిమాఫియా వల్ల పార్టీకి చెడ్డపేరు వస్తుంది. కష్టపడ్డ కార్యకర్తలను ఆదుకోవాలని విజ్ఞప్తి చేసినట్లు చెబుతున్నారు.

టీడీపీ కార్యాలయం తొలగింపు

కడప నగరం చిన్నచౌకులోని అప్సర సర్కిల్‌లో ఏర్పాటు చేసిన టీడీపీ కార్యాలయాన్ని సోమవారం సాయంత్రం, రాత్రి మూసివేశారు. ఈ ఏడాది 1 నుంచి 15 డివిజన్ల కేడరు కోసమంటూ గత ఏడాది జూన్ 16న ఎమ్మెల్యే ఆర్.మాధవి పార్టీ కార్యాలయాన్ని ఓపెన్ చేశారు. ఇది వైసీపీ నేత గుమ్మా రాజేంద్రనాథరెడ్డికి చెందినదని చెబుతారు. ఇక్కడ కార్యాలయం ఏర్పాటు చేయడంతో అప్పట్లో విమర్శలు వచ్చాయి. అయితే ఇటీవల టీడీపీ సోషల్ మీడియాలో కడప అప్సర సర్కిల్ చిన్నచౌకు ఏరియా ఆఫీసు ఏ హోదాతో నడుపుతున్నారు, ప్యారాచూట్ బ్రదర్స్ ఐదుగురు క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు, 15 మంది యూనిట్ ఇన్‌చార్జ్‌లు, 105 మంది బూత్‌ఇన్‌చార్జ్‌లు, వెయ్యి మంది కార్యకర్తల అనుమతి ఉందా అంటూ ప్రశ్నిస్తూ పోస్టు చేశారు. ఈ నేపథ్యంలో ఇక్కడ కార్యాలయం క్లోజ్ చేయడం చర్చనీయాంశంగా మారింది.



మహానాడు కోసం స్థలాన్ని పరిశీలిస్తున్న మంత్రి సవిత



చిన్నచౌకులో టీడీపీ ఆఫీసును తొలగించిన దృశ్యం

అధికారుల సూచనలు రైతులు పాటించాలి

ఓబులవారిపల్లె, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి):అధికారుల సూచనల ను రైతులు పాటించాలని రైల్వేకోడూరు డివిజన్ వ్యవసాయాధికారి కవిత, మండల అగ్రికల్చర్ ఆఫీసర్ బి.మల్లిక సూచించారు. మండలంలోని గోవిందంపల్లె గ్రామ పంచాయతీలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బొప్పాయి తోటల్లో వైరస్ నివారణకు తీసుకోవాల్సిన చర్యలు, జిగురు అట్టల వినియోగంతో లాభాలను వివరించారు. వ్యవసాయ రంగంలోవస్తున్న మార్పులపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో విలేజ్ అసిస్టెంట్ అగ్రికల్చర్ మహేష్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది బుల్లయ్య , గ్రామస్థులు పాల్గొన్నారు.

సిద్ధవటం: మండలంలోని కడపాయపల్లె గ్రామంలో ఏడీఏ నాగరాజు మాట్లాడుతూ నువ్వులు, వరి, కూరగాయలు, ఆకు కూరల పంటల్లో జాగ్రత్తలు, సస్యరక్షణ చర్యలను వివరించారు. జీవన ఎరువులు, విత్తనాలు కొనుగోలులో రైతులు తీసుకోవలసిన జాగ్రత్తలు వివరించారు. కల్చర్ ఏవో రమేష్‌రెడ్డి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యస్వామికి పూజలు

రైల్వేకోడూరు, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని భుజంగేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం సుబ్రహ్మణ్యస్వామికి పూజలు, అభిషేకాలు చేశారు. వందలాది మంది భక్తులు పాల్గొన్నారు. ఆలయ అర్చకుడు యోగి భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. స్వామివారిని వివిధ రకాల పూలతో అలంకరించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

సిద్ధవటం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : ద్విచక్ర వాహనం అదుపు తప్పి కింద పడడంతో ఓ వ్యక్తి గాయపడ్డాడు. 108 సిబ్బంది చెప్పిన కథనం మేరకు వేంపల్లికి చెందిన వెంకటరమణ మంగళవారం సాయంత్రం సిద్ధవటం బాకరాపేట రహదారిలో ద్విచక్ర వాహనంలో వస్తూ అదుపు తప్పి కిందపడడంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు సమాచారం తెలపడంతో అతనిని కడప రిమ్స్‌కు తరలించామని తెలిపారు.

మద్యం మత్తులో కర్రతో దాడి

సిద్ధవటం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : మద్యం మత్తులో ఓ వ్యక్తి మరో వ్యక్తిపై దాడి చేశాడు. పోలీసుల కథనం మేరకు బాకరాపేటకు చెందిన నరేష్ మద్యం మత్తులో కూలి పని కోసం వచ్చిన రుద్రవరం గ్రామానికి చెందిన ప్రసాద్‌పై కర్రతో దాడి చేశాడు. దీంతో తీవ్రంగా గాయపడిన అతనిని కడప రిమ్స్‌కు తరలించి, బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ సుబ్బరామచంద్ర తెలియజేశారు.

ఎంపీటీసీ మాజీ సభ్యుడు సుధాకర్‌రాజు మృతి

రైల్వేకోడూరు, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని వీపీఆర్ కండ్రిక పంచాయతీ సిద్ధిరాజుకండ్రికకు చెందిన ఎంపీటీసీ మాజీ సభ్యులు గుంటిమడుగు సుధాకర్ రాజు మంగళవారం గుండెపోటు తో మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. ఆయన వైసీపీ మండల కన్వీనర్‌గా పని చేశారు. ఆయన మృతికి అన్ని పార్టీలకు చెందిన నాయకులు స్థానికులు సంతాపం తెలిపారు.

తూతూ మంత్రంగా.. రోడ్డు మరమ్మతులు

- కొద్ది రోజులకే దెబ్బతిన్న ప్యాచ్‌లు
- ఇప్పటికీ దర్శనమిస్తున్న గుంతలు

రైల్వేకోడూరు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం రోడ్ల దుస్థితి గురించి పట్టించుకున్న పాపాన పోలేదు. సంక్రాంతి కల్లా రోడ్లకు మర్మతులు చేస్తామని ప్రస్తుత కూటమి ప్రభుత్వ పాలకులు, అటు అధికారులు చెప్పారు. ఇందులో భాగంగా రాజంపేట నుంచి రేణిగుంట వరకు రోడ్లపై గుంతలు పూడ్చి ప్యాచ్ వర్క్ చేయాలని ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది. పనులు ప్రారంభమయ్యాయి. అయితే, రోడ్డుపై వేసిన ప్యాచ్‌లు రోజులు గడవకుండానే దెబ్బతిన్నాయి. కొన్ని చోట్ల గుంతలను కూడా పూడ్చలేదు. మండలంలోని బాలపల్లె వద్ద గుంతలు ఇప్పటికీ దర్శనమిస్తున్నాయి. శెట్టిగుంట వద్ద వేసి రోడ్డు అప్పుడే ధ్వంసమైంది. ఇదే పరిస్థితి చాలా చోట్ల దర్శనమిస్తోంది. రోడ్డు దెబ్బతిన్న ప్రాంతాల్లో దుమ్ము రేగుతోంది. ఈ నేపథ్యంలో ప్యాచ్ వర్క్ పనుల నాణ్యతపై విమర్శలు వినిపిస్తున్నాయి,. అధికారుల పర్యవేక్షణ సక్రమంగా లేకపోవడంతోనే ఈ పరిస్థితికి కారణమని ప్రయాణికులు భావిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు పనులను పరిశీలించి చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు.



బాలపల్లె వద్ద రోడ్డుపై గుంతలు (ఇన్‌సెట్‌లో) శెట్టిగుంట సమీపంలో ప్యాచ్ వర్క్ చేసిన చోట వదిలేసిన గుంతలు

'ఈ-శ్రమ్'లో కార్మికుల వివరాలను పొందుపరచాలి

- డీఆర్వో మధుసూదనరావు

రాయచోటి(కలెక్టరేట్), ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): అసంఘటిత కార్మికుల కోసం కేంద్ర ప్రభుత్వం రూపొందించిన ఈ-శ్రమ్ పోర్టల్‌లో కార్మికుల వివరాలను పొందుపరచాలని డీఆర్వో మధుసూదనరావు అధికారులను ఆదేశించారు. మంగళవారం రాయచోటి కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో ఈశ్రమ్ పోర్టల్‌పై మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు తదితర అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులకు సామాజిక భద్రత కల్పన, ఇతర సంక్షేమ పథకాల అమలు వంటి ముఖ్యమైన ఉద్దేశాలతో ఈశ్రమ్ పోర్టల్‌ను కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిందన్నారు. 16 నుంచి 59 ఏళ్ల మధ్య వయసు కలిగిన కార్మికులు ఇన్‌కం ట్యాక్స్ కట్టని వారు తదితరుల వివరాలను ఈ పోర్టల్‌లో పొందుపరచాలన్నారు. ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు తదితర అధికారులు వారి వారి కార్యాలయాల పరిధిలో పనిచేస్తున్న అసంఘటిత కార్మికుల వివరాలను ఈశ్రమ్ పోర్టల్‌లో పొందుపరచాలని, ఏమైనా సమస్యలు ఎదురైతే జిల్లా కార్మిక శాఖ అధికారితో సమన్వయం చేసుకొని పనిని పూర్తి చేయాలన్నారు.



అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్వో మధుసూదనరావు

ఈ సమావేశంలో కార్మికశాఖ జిల్లా అధికారి రంగరాజు, ఎంపీడీవోలు తదితరులు పాల్గొన్నారు.

సోలార్ రూఫ్ టాప్‌ను ఏర్పాటు చేసుకోండి

చిట్వేలి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : సోలార్ రూఫ్ టాప్‌ను ఏర్పాటు చేసుకోవడం ద్వారా విద్యుత్ బిల్లు తగ్గించుకోవచ్చని రాజంపేట ట్రాన్స్‌కో డీఈ రాజశేఖర్‌రెడ్డి గృహ వినియోగదారులకు సూచించారు. మంగళవారం చిట్వేలి పంచాయతీ కార్యాలయంలో ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన పథకంపై వినియోగదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీఈ మాట్లాడుతూ పీఎం సూర్యఘర్‌కు బ్యాంకు రుణం పొందే విధి విధానాలను వివరించారు. ఏడీ మురళీధర్‌రెడ్డి మాట్లాడుతూ 1 కిలో వాట్‌కు 30 వేలు, 2 కిలో వాట్‌కు 60 వేలు, 3 కిలోవాట్‌కు 78 వేలు ప్రభుత్వం రాయితీ ఇస్తుందన్నారు. మొత్తం ఖర్చులో 10 శాతం రుణ గ్రహీత చెల్లించాల్సి ఉంటుందన్నారు. గృహ వినియోగదారులకు ఈ పథకం చాలా ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈ వెంకటచలపతి, ఉప సర్పంచ్ ఉమామహేశ్వర్‌రెడ్డి, సీనియర్ నాయకులు లారీ సుబ్బరాయుడు, గుత్తి నరసింహ, వినియోగదారులు పాల్గొన్నారు.

స్కూల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ఓబులవారిపల్లె, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ఏపీఎండీసీ పబ్లిక్ స్కూల్లో సేవలందించిన తమకు అన్యాయం తగదని కార్మికులు వాపోయారు. వారం రోజులకు పైగా స్కూల్ గేటు బయట రిలే నిరాహార దీక్షలు చేస్తున్నా, ఇటు స్కూల్ యాజమాన్యం కాని, అటు ఏపీఎండీసీ సంస్థ కానీ పట్టించుకోకపోవడం అన్యాయమని, దీనిపై ప్రభుత్వ అధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరుతున్నారు. మూడేళ్లకు పైగా పనిచేస్తున్న తమను తొలగించడం అన్యాయమన్నారు.

రుణాలు మంజూరు చేయాలి

సిద్ధవటం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : బీసీ కార్పొరేషన్ ద్వారా రుణాలు మంజూరు, గ్రామీణ ప్రాంతాల్లో రహదారులు అభివృద్ధి చేయాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి సవితకు విన్నవించినట్లు పంచాయతీ రాజ్ రాష్ట్ర ఆర్గనైజింగ్ కమిటీ సెక్రటరీ కుప్పాల వెంకటసుబ్బయ్య తెలిపారు. కడప ఆర్ అండ్ బీ గెస్ట్ హౌస్‌లో మంగళవారం సాయంత్రం ఆమెను కలిసి ఈ మేరకు విన్నవించినట్లు వివరించారు.అనంతరం మంత్రిని సన్మానించామన్నారు.



ఇన్‌చార్జి మంత్రిని సత్కరిస్తున్న కుప్పాల

అపుస్మా ఉపాధ్యక్షుడుగా పన్నీరు రాజశేఖర్

రాజంపేట, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రైవేటు పాఠశాలల అసోసియేషన్ (అపుస్మా) రాష్ట్ర ఉపాధ్యక్షుడుగా ఓబులవారిపల్లె మండలం ముక్కావారిపల్లెకు చెందిన మక్కా ఉన్నత పాఠశాల కరస్పాండెంట్ పన్నీరు రాజశేఖర్ ను రాష్ట్ర ఉపాధ్యక్షుడుగా ఎన్నుకున్నారు. మంగళవారం గుంటూరులో ప్రైవేటు పాఠశాలల రాష్ట్ర కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన రాష్ట్ర అధ్యక్షుడు తులసి విష్ణుప్రసాద్, జిల్లా అధ్యక్షుడు వీఆర్‌రెడ్డి, శాసనమండలి సభ్యుడు రామచంద్రారెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. రాష్ట్రంలో ప్రైవేటు పాఠశాలల ఉన్నతికి, వాటి సమస్యల పరిష్కారానికి తమవంతు కృషి చేస్తామన్నారు.



దర్గాలో సుగవాసి ప్రసాద్‌బాబు ప్రార్థనలు

చిన్నమండెం, ఫిబ్రవరి4 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని హజరత్ షాఅలీ గంజే షహిద్‌బాబా రహంతుల్లా అలైహి గారి దర్గా గంధం ఉత్సవాల్లో రాష్ట్ర టీడీపీ కార్య నిర్వాహక కార్యదర్శి సుగవాసి ప్రసాద్‌బాబు పాల్గొన్నారు. కడప పెద్ద దర్గా పీఠాధిపతి అరీఫుల్లా హుస్సేనీతో కలిసి ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో చిన్నమండెం మండల తెలుగు యువత అధ్యక్షుడు తౌహిద్‌ఖాన్, రాంప్రసాద్‌నాయుడు, బాలచంద్రయాదవ్, మయాన ఇర్షాద్‌ఖాన్, సైఫుల్లాఖాన్, షాబుద్దీన్, బాబు, సిద్దయ్య, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సుగవాసి ప్రసాద్‌బాబుకు స్వాగతం పలుకుతున్న దర్గా నిర్వాహకులు

సమస్యల పరిష్కారమే సీపీఎం లక్ష్యం

రాజంపేట టౌన్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కారమే ఊపిరిగా పోరాడుతామని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు సీహెచ్ చంద్రశేఖర్, చిట్వే లి రవికుమార్, పందికాళ్ల మణి తెలిపారు. నెల్లూరులో మూడు రోజులుగా నిర్వహించిన సీపీఎం మహాసభల్లో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి నిర్వహించాల్సిన ఉద్యమాలపై ఈ మహాసభల్లో నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. సీపీఎం రాష్ట్ర ప్రధానకార్యదర్శి గా జి.శ్రీనివాసరావును తిరిగి ఎన్నుకోవడం ఉద్యమ స్ఫూర్తికి ఊపిరి నిచ్చిందన్నారు.

భోగాంజనేయ ఆలయ బ్రహ్మోత్సవాలు ప్రారంభం

నందలూరు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కుంపిణీపురం భోగాంజనేయ స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలుమంగళవారం ప్రారంభమయ్యాయి. అర్చకుడు రఘునాథాచార్యులు ఆధ్వర్యంలో ఉదయం ఉపనయనం, పంచామృతాభిషేకం, అనంతరం స్వామివారికి ఆకు పూజ, ఆస్థాన పూజ నిర్వహించారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు. రాత్రి స్వామివారు గరుడ వాహనంపై పురవీధుల్లో ఊరేగారు. భక్తులు కాయకర్పూరం సమర్పించి మొక్కులను చెల్లించుకున్నారు.



ప్రత్యేక అలంకరణలో భోగాంజనేయస్వామి

సురక్షిత ప్రయాణానికి హెల్మెట్ తప్పనిసరి

రామాపురం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనదారులు సురక్షితంగా ప్రయాణించాలంటే హెల్మెట్ తప్పనిసరిగా ధరించి వాహనాన్ని నడపాలని ఎస్ఐ వెంకటసుధాకర్‌రెడ్డి అన్నారు. మంగళవారం రామాపురం పోలీస్‌స్టేషన్ వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుటూ టూవీలర్ నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. ఫోర్ వీలర్ వెహికల్స్ భారీ వాహనాలు డ్రైవర్లు సీట్ బెల్ట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. వాహనాలు నడిపేటప్పుడు అనుకోని సంఘటన జరిగితే ప్రాణాపాయం నుండి మిమ్మల్ని రక్షించేది హెల్మెంటు, సీటు బెల్టే అన్నారు. నందలూరు, రాయచోటి పట్టణంలో ఆయా ప్రాంతాల పోలీసులు వాహనాల తనిఖీలు నిర్వహించారు.

తెలంగాణలో కులగణన దేశానికే ఆదర్శం

- డీసీసీ అధ్యక్షుడు గాజుల భాస్కర్

రాయచోటిటౌన్, ఫిబ్రవరి4(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహించిన కులగణన దేశానికే ఆదర్శమని, ఈ సర్వే యావత్ భారతానికి దిక్సూచిగా నిలుస్తుందని కాంగ్రెస్ పార్టీ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు గాజుల భాస్కర్ అన్నారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రాహుల్‌గాంధీ దూర దృష్టికి కులగణన ఒక నిదర్శనం అన్నారు. రాష్ట్రంలో కూడా కులగణన చేయాలని కూటమి ప్రభుత్వాన్ని తాము డిమాండ్ చేస్తున్నామన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని ఐదున్నర కోట్ల జనాభాలో వెనుకబడిన వర్గాల వారి సంఖ్య తేల్చాలన్నారు. రాజకీయ, సామాజిక, విద్యా, ఉద్యోగాల్లో ఎస్సీ ఎస్టీ, బీసీల వాటా వారికి దక్కాలన్నారు. . గత వైసీపీ ప్రభుత్వం ఎన్నికల ముందు కులగణన చేసినా మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆ సర్వే వివరాలను తొక్కిపెట్టాడని ఆరోపించారు. బీజేపీ డైరెక్షన్‌లోనే కులగణన సర్వే రిపోర్టు బయటకు పొక్కకుండా కుట్ర చేశారన్నారు. దేశ వ్యాప్తంగా కులగణన చేసి బడుగు, బలహీన వర్గాలకు న్యాయం చేయాలని రాహుల్‌గాంధీ డిమాండ్ చేస్తుంటే, రిజర్వేషన్లు రద్దు కోసం కుట్రలు చేస్తున్నారని బీజేపీ ప్రభుత్వం తప్పుదారి పట్టిస్తోందన్నారు.

12వ పీఆర్సీని నియమించాలి

పెనగలూరు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం వెంటనే 12వ పీఆర్సీ కమిటీని నియమించాలని ఎస్టీయూ ఏపీ ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ అల్లం అశోక్ కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం పెనగలూరు ఉన్నత పాఠ శాల ఆవరణలో ఎస్టీయూ నాయకులతో కలిసి ఆయన విలేకరుల సమావేశంలో మా ట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు 30 శాతం వెంటనే డీఏ ప్రకటించాలని కోరారు. సూపర్ సిక్స్ పథకాల్లో కొన్నింటిని విజయవంతంగా అమలు చేస్తున్న ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు కూడా 30 శాతం ఐఆర్ ప్రకటించాలని కోరారు. పీఎస్‌ను రద్దు చేసి తిరిగి పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని ఈ సంద ర్భంగా కోరారు. ఈ సమావేశంలో ఎస్టీయూ జిల్లా మాజీ అధ్యక్షుడు పిల్లి రామకృష్ణ, క్రీడలు, సాంస్కృతిక విభాగం కన్వీనర్ పి.ఎల్లయ్య, మండల అధ్యక్షుడు బి.రాఘవరెడ్డి, రవికుమార్, వేణుగోపాల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న పిల్లి రామకృష్ణ

16 నుంచి ఏఐటీయూసీ మహాసభలు

రైల్వేకోడూరు/ పెనగలూరు, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): ఈ నెల 16, 17 తేదీల్లో రైల్వేకోడూరులో ఏఐటీయూసీ జిల్లా ప్రథమ మహా సభలను నిర్వహిస్తున్నట్లు జిల్లా కార్యదర్శి గంగాధర్ తెలిపారు. మంగళవారం రైల్వేకోడూరు మండలంలోని అనంతరాజుపేట పంచాయతీ తంబిళ్లవారిపల్లె ప్రాథమిక కేంద్రం వైద్యుడు రమేష్, ఆరోగ్య పర్యవేక్షణ అధికారి, ఆశ వర్కర్లతో కలసి మహా సభల గోడ పత్రాలను విడుదల చేశారు.

ఘనంగా రథసప్తమి వేడుకలు



నందలూరు: సూర్యప్రభ వాహనంపై సౌమ్యనాథస్వామి



సిద్ధవటం: ఊరేగుతున్న భద్రావతి భావనారాయణులు

నందలూరు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : రథసప్తమి సందర్భంగా స్థానిక సౌమ్యనాథస్వామి ఆలయం మంగళవారం భక్తులతో కిటకిటలాడింది. ఉదయం సౌమ్యనాథస్వామి సూర్యప్రభ వాహనంపై మత్స్యావతారంలో, రాత్రి చంద్రప్రభ వాహనంపై కృష్ణమూర్తి అలంకారంలో మాడవీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు కాయ కర్పూరం సమర్పించి తమ మొక్కులను తీర్చుకున్నారు.

సిద్ధవటం: మండలంలోని పార్వతీపురం మాధవరం గ్రామాల్లో భద్రావతి బావనారాయణ విగ్రహాలను ఊరేగించారు. మహిళలు పెద్దఎత్తున పాల్గొని కాయ కర్పూరం సమర్పించారు. భక్తులకు ఆలయ కమిటీ నిర్వహకులు తీర్థ ప్రసాదాలు అందించారు.

వాహనాల పార్కింగ్‌కు స్థలాన్ని కేటాయించండి

రైల్వేకోడూరు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ద్విచక్ర వాహనాలకు పార్కింగ్ స్థలాన్ని ఏర్పాటు చేయాలంటూ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు పండుగోల మణి మంగళవారం రైల్వేకోడూరు పంచాయతీ ఈవో ప్రసాద్‌రావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని ప్రధానదారిలో ద్విచక్ర వాహనాలు నిలిపేందుకు వీలు లేకుండా పోయిందన్నారు. తక్షణమే ఆక్రమణలను తొలగించి పార్కింగ్ స్థలాన్ని ఏర్పాటు చేయాలన్నారు. లేకుంటే పంచాయతీ కార్యాలయం వద్ద సామూహిక నిరాహార దీక్షలు నిర్వహిస్తామని హెచ్చరించారు.



ఈవో ప్రసాద్‌రావుకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ప్రజల అర్జీలను తొందరగా పరిష్కరించాలి

గాలివీడు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ప్రజల నుంచి అందే అర్జీలను తొందరగా పరిష్కరించాలని తహసీల్దార్ భాగ్యలత వీఆర్‌వోలకు తెలియజేశారు. మంగళవారం ఆమె వీఆర్‌వోలతో మాట్లాడుతూ ప్రస్తుతం భూములకు సంబంధించిన సమస్యలపై అర్జీలు ఎక్కువగా వస్తున్నాయని, వీఆర్‌వోలు క్షేత్రస్థాయిలో వాటిని పరిశీలించి చర్యలు తీసుకోవాలన్నారు. వివిధ రకాల సర్టిఫికెట్ల కోసం ప్రజలు ఇచ్చి అర్జీలు కూడా తొందరగా పరిష్కరించాలని తెలిపారు. హౌసింగ్‌కు సంబంధించిన అర్జీల పరిష్కారానికి కృషి చేయాలన్నారు.



రైతుల సమస్యలను వింటున్న తహసీల్దార్ భాగ్యలత

పేద విద్యార్థినికి ఆర్థిక సాయం

లక్కిరెడ్డిపల్లె, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ఉద్యాన డిప్లొమా చదువుతున్న పేద విద్యార్థినికి మానవత స్వచ్ఛంద సేవాసంస్థ మండల అధ్యక్షుడు డాక్టర్ షఫీనాయక్ సెంట్రల్ కమిటీ సభ్యుడు వైప్రసాదుయాదవ్, చైర్మన్‌బాల సుబ్రమణ్యం మంగళవారం రూ. 13 వేలు ఆర్థిక సాయం అందజేశారు. అప్పకొండయ్యగారిపల్లె హరిజనవాడకు చెందిన జానకోల్ల అఖిల కలికిరి ఉద్యాన కళాశాలలో డిప్లొమా చదువుతోంది. తండ్రి లేకపోవడంతో తల్లి కూలీనాలి చేసుకొని కుటుంబాన్ని పోషిస్తుండడంతో , ఆ విద్యార్థిని చదువు పూర్తయేంత వరకు సహాయ సహకారాలు అందిస్తామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో శివశంకర్‌రెడ్డి, శివయ్య, ఎర్రయ్య, సిద్దారెడ్డి పాల్గొన్నారు.



విద్యార్థినికి నగదు అందజేస్తున్న మానవత సంస్థ సభ్యులు

క్యాన్సర్ బాధితుడికి..

నందలూరు, ఫిబ్రవరి 4 (ఆంధ్ర జ్యోతి):క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న మండలంలోని ఓబిలి గ్రామానికి చెందిన ప్రవీణ్ అనే యువకుడికి లయన్స్‌క్లబ్ సభ్యులు మంగళవారం 10 వేల రూపాయలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా విభ ఎరుడైట్ స్కూల్ చైర్మన్ డాక్టర్ జయభాస్కర్‌రావు మాట్లాడుతూ క్యాన్సర్‌ను ప్రాథమిక దశలో గుర్తిస్తే చికిత్సతో నివారించుకోవచ్చునన్నారు. లయన్ మన్నెం రామ్మోహన్ మాట్లాడుతూ తిరుపతి లోని టాటా డీబీఆర్ క్యాన్సర్ ఆస్పత్రిలో ఉచితంగానే వైద్యం అందుతుందని, అందుకు తాము కూడా సహకరిస్తామని తెలియజేశారు. లయన్ కుర్రా మణియాదవ్, కొత్తపల్లె రాజాచారి, దాసరి నరసింహులు, మోడపోతుల రాము, గంధం గంగాధర్, గుండు సురేష్ పాల్గొన్నారు.



ఆర్థికసాయం అందజేస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

అనారోగ్యానికి గురైన పేద మహిళకు...

రాజంపేట, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : శస్త్ర చికిత్స చేయించుకున్న మండలంలోని మదనగోపాలపురం గ్రామానికి చెందిన విజయమ్మ అనే పేద మహిళకు మంగళవారం గ్లోబల్ ఫౌండేషన్ ట్రస్టు తరఫున డాక్టర్ భూపతిరాజుఅందజేసిన రూ. 65 వేలు న్యాయవాది కొండూరు శరత్‌కుమార్‌రాజు బాధిత మహిళకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమెరికాలో నివసిస్తున్న గ్లోబల్ ఫౌండేషన్ అధినేత డాక్టర్ భూపతిరాజు రాజంపేట మండలంలోని ఎంజీపురం, తాళ్లపాక, హెచ్.చెర్లోపల్లె పంచాయతీలను దత్తత తీసుకుని అభివృద్ధి చేస్తున్నారన్నారు. ఇందులో భాగంగా ఇటీవల ఆయా గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించారన్నారు. ఈ కార్యక్రమంలో కె.విశ్వనాథ్‌రాజు, రుద్రనారాయణరాజు, సుబ్బరామరాజు పాల్గొన్నారు.



విజయమ్మకు నగదు అందజేస్తున్న కొండూరు శరత్‌కుమార్‌రాజు

తలనీలాల వేలం వాయిదా

సిద్ధవటం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : మహాశివరాత్రి సందర్భంగా నిత్యపూజేశ్వరస్వామి దేవస్థానంలో తలనీలాలు సేకరించుకునే హక్కులకు నిర్వహించిన వేలం గత సంవత్సరం కన్నా తక్కువ మొత్తానికి నిలచిపోవడంతో వాయిదా వేసినట్లు ఎండోమెంట్ అధికారి మోహన్‌రెడ్డి తెలిపారు. మండల కేంద్రంలోని రంగనాథస్వామి గుడిలో మంగళవారం నిర్వహించిన ఈ వేలం రూ. 3 లక్షలతో ప్రారంభించగా, రూ. 3.30 లక్షలకు పాట నిలచిపోయింది. గత ఏడాది కన్నా ఇది రూ. 2.25 లక్షలు తక్కువ కావడంతో వేలాన్ని శనివారానికి వాయిదా వేశారు. దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ జనార్దన్‌రావు, సిబ్బంది చంద్రజ్యోతి, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

రామాపురం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బండపల్లి పంచాయతీ ప్రేమాలయంలోని వృద్ధాశ్రమంలో మంగళవారం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. రాయచోటి టౌన్‌కు చెందిన మనోహర్, మనస్వి దంపతుల కుమారుడు రెడ్డిదార్శిక్ మూడో పుట్టినరోజు సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ జోనల్ చైర్మన్ మహమ్మద్, జిల్లా చైర్మన్ హరీశ్‌చంద్ర, దాతలు, సిబ్బంది పాల్గొన్నారు

ఓట్లేసి రండి చూద్దాం

- వెటకారంగా ద్వితీయ శ్రేణి నేతలు
- నాలుగు గ్రామాలపై కక్ష సాధింపు
- భూములు ఆన్‌లైన్‌లో తొలగింపు
- రుణం కట్టమని ఒత్తిడి
- దిక్కుతోచని స్థితిలో రైతన్నలు



తరాలుగా సాగు చేసుకుంటున్న భూమి

బి.కోడూరు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): గతంలో మాకు ఓట్లు పడలేదు, ఈ దఫా ఓట్లేసి వస్తే అప్పుడు రైతుల సమస్యలను పరిశీలిస్తామని ఎమ్మెల్సీ వద్దనున్న ద్వితీయ శ్రేణి నేతలు రైతుల పట్ల వెటకారంగా మాట్లాడుతున్నారు. ఓట్లు వేయలేదని నాలుగు గ్రామాల్లో సుమారు 1200 ఎకరాల భూములను ఆన్‌లైన్‌లో తొలగించడంతో రైతులకు ఇబ్బందలు తప్పలేదు. ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి దగ్గరకు వెళ్లి మా భూములు ఆన్‌లైన్ నుంచి తొలగించారు, మీరైనా చెప్పండని గగ్గోలు పెట్టుకున్నా ఫలితం శూన్యం. అప్పటి నుంచి ఇప్పటి వరకు కలెక్టరు, ఆర్డీఓ, తహసీల్దారు కార్యాలయాల చుట్టూ రైతులు కాళ్లరిగేలా తిరుగుతున్నారు. ప్రభుత్వం మారినా వారికి ఇబ్బందులు తప్పడంలేదు. రుణాల బకాయిలు చెల్లించాలని బ్యాంకు అధికారులు గ్రామాల్లో రైతులను నిలదీస్తున్నారు. వైసీపీ ప్రభుత్వంలో పడిన ఇబ్బందులే ప్రస్తుత కూటమి ప్రభుత్వంలోనూ పడుతున్నామని పలువురు రైతులు వాపోతున్నారు. తరాలుగా బావుల తవ్వకం, మోటార్లు బాగించుకోవడం, ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేసుకున్నా ఆన్‌లైన్‌లో పేర్లను తొలగించారు. దీంతో చేసేదిలేక రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. ఆన్‌లైన్‌లో పేర్లు తొలగించడంతో రుణాలు ఏకమొత్తంలో కట్టడమా, రెన్యువల్ చేయించుకోవడమా జరగాలని బ్యాంకు అధికారులు ఒత్తిడి తెస్తున్నారు. రెవెన్యూ సదస్సులు నిర్వహించి రైతుల భూ సమస్యలన్నీ తీర్చుతామని కూటమి ప్రభుత్వం ప్రకటనలతో రైతులు ఎంతో ఆశతో ఇప్పటికే రెండు గ్రామసభల్లో అర్జీలు ఇచ్చి అధికారులతో మొరపెట్టుకున్నా ఇంత వరకు ఎలాంటి పరిష్కారం దొరకలేదు.

ఆ నాలుగు గ్రామాలపై కక్ష

పాయలకుంట్ల, మాధవరాయునిపల్లె, పెదుళ్లపల్లె, తిప్పరాజుపల్లె గ్రామాల రైతులు ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి వద్దకు వెళ్లి ఆన్‌లైన్ తొలగింపు విషయమై మొరపెట్టుకున్నారు. ఆయనెలాంటి పరిష్కార మార్గం చూపలేదు. ఈ నాలుగు గ్రామాల్లో దాదాపు 1200 ఎకరాల భూమిని ఆన్‌లైన్ నుంచి తొలగించి రైతులను ఇబ్బందులపాలు చేశారు. ఆన్‌లైన్‌లో తొలగించిన భూములు కింది స్థాయి అధికారులు యథావిధిగా చేసేందుకు అనుమతులు లేవని అధికారులు చెబుతున్నారని రైతులు వాపోతున్నారు.

బ్యాంకు ఒత్తిడి ఎక్కువైంది

ఈ నాలుగు గ్రామాల రైతులు వివిధ బ్యాంకుల్లో తమ పొలాలు తనఖా పెట్టి అధిక మొత్తంలో రుణాలు తెచ్చుకున్నారు. అయితే ఏటా రెన్యువల్ చేసుకుంటూ వస్తున్నారు. తమ భూములు ఆన్‌లైన్ నుంచి తొలగించడంతో బ్యాంకుకు వెళ్లి రెన్యువల్ చేసుకోవాలంటే భూముల ఆన్‌లైన్ పత్రం అడుగుతున్నారు. అది తీసుకువస్తామనుకుంటే భూములన్నీ ఆన్‌లైన్‌లో తొలగించారు. దీంతో ఏడాదిగా రైతులు బ్యాంకు వైపు కన్నెత్తి చూడడంలేదు. బ్యాంకు అధికారులు మాత్రం రోజూ ఇళ్ల వద్దకు వెళ్లి బకాయిలు చెల్లించాలంటూ రైతులను ఇబ్బందులు పెడుతున్నారు.

గ్రామసభలో అయినా మా సమస్యలు తీరేనా

కూటమి ప్రభుత్వం వచ్చాక ఇప్పటికే రెండు దఫాలుగా రెవెన్యూ గ్రామసభలు నిర్వహించారు. ఈ సభల్లో రైతుల భూ సమస్యలు పరిష్కరించి ఎలాంటి సమస్య లేకుండా చూడాలన్నదే ప్రభుత్వ ధ్యేయం. అయితే మండలంలో అందుకు విరుద్ధంగా భూములు ఆన్‌లైన్‌లో తొలగించడం, వాటిని తిరిగి ఎక్కించకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఉన్నతాధికారులు గమనించి మా భూములను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని వారు ప్రభుత్వాన్ని, అధికారులను వేడుకుంటున్నారు. ఈ విషయమై తహసీల్దారు మధునాయక్ వివరణ ఇస్తూ గతంలో తహసీల్దార్లు చేసిన నిర్వాకంతోనే ఆన్‌లైన్ నుంచి భూములు తొలగించారు. ప్రస్తుతం ఇది మా చేతుల్లో లేదు. ఉన్నతాధికారులకు తెలపడమే మా బాధ్యత వారి ఆదేశాల మేరకే తప్పకుండా ఆన్‌లైన్ కొనసాగిస్తామని ఆయన తెలిపారు.

600 ఎకరాలు ఆన్‌లైన్ నుంచి తొలగించారు



తిప్పరాజుపల్లె గ్రామం రెవెన్యూ పొలంలో దాదాపు 600 ఎకరాలు ఆన్‌లైన్ నుంచి తొలగించారు. గ్రామస్తులమంతా మూకుమ్మడిగా అధికారుల వద్దకు వెళుతున్నా వారు పట్టించుకోవడంలేదు. ఇప్పటికైనా మా భూములు మాకు గతంలో మాదిరిగానే ఆన్‌లైన్‌లో ఉండేలా చూస్తే మంచిది. బ్యాంకు అధికారులు రోజూఇంటి చుట్టూ తిరుగుతుండడం ఇబ్బందిగా ఉంది.

దుగ్గినేని సుబ్బరామయ్య, రైతు, తిప్పరాజుపల్లె

మా గ్రామాలపైనే కక్షగట్టారు



పాయలకుంట్ల పంచాయతీలో కామకుంట, వేమకుంట, ఏ.కొత్తపల్లె రెవెన్యూ గ్రామాల్లో దాదాపు 600 ఎకరాలు ఆన్‌లైన్ నుంచి తొలగించారు. మా నాలుగు గ్రామాలపైనే కక్షగట్టారు. అంతా వెళ్లి ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డిని అడిగినా ఆయన పట్టించుకోలేదు. మూడు తరాలుగా మేం భూములు సాగు చేసుకుంటున్నాం. ప్రస్తుత ప్రభుత్వం, అధికారులు మా సమస్యలు తీర్చాలని కోరుతున్నాం.

ఎల్.రాఘవరెడ్డి, రైతు, పాయలకుంట్ల

మల్లయ్యకొండకు రూ.6,64,916 ఆదాయం

- గతం కంటే పెరిగిన హుండీ ఆదాయం



హుండీ కానుకలను లెక్కిస్తున్న దేవదాయ శాఖ అధికారులు, భక్తులు

తంబళ్లపల్లె, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన భ్రమరాంబిక సమేత మల్లికార్జున స్వామి మల్లయ్యకొండకు భక్తులు హుండీలో సమర్పించిన కానుకల ద్వారా రూ.6,64,916లు ఆదాయం చేకూరినట్లు ఆలయ ఈఓ మునిరాజ తెలిపారు. మంగళవారం ఆలయంలో కూటమి నేతలు, ఈఓ, ఆలయ ఇన్‌స్పెక్టర్ శశికుమార్ ఆధ్వర్యంలో భక్తులు హుండీలో వేసిన కానుకలు లెక్కించారు. గతేడాది అక్టోబరు 30 నుంచి ఈ ఏడాది ఫిబ్రవరి 4వ తేదీ (3 నెలల 7 రోజులకు) వరకు వచ్చిన హుండీ కానుకలు లెక్కించగా ఈ ఆదాయం వచ్చినట్లు తెలిపారు. కొండ పైకి పూర్తి స్థాయిలో రోడ్డు సౌకర్యం ఉండడం, ప్రతి సోమవారం కొండ పైకి ఆర్టీసీ బస్సులు, ప్రైవేటు వాహనాలు తిరుగుతుండడంతో భక్తుల తాకిడి పెరుగుతున్నట్లు తెలిపారు. గతేడాది అక్టోబరు 30వ తేదీన(3 నెలల 20 రోజులకు) హుండీ ద్వారా రూ.5,94,257లు ఆదాయం వచ్చింది. కూటమి నేతలు ఉత్తమ్‌రెడ్డి, మల్లయ్యకొండ మాజీ చైర్మెన్ గంగుల్‌రెడ్డి, పార్లమెంట్ బీసీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి సోముశేఖర్, క్లస్టర్ ఇన్‌చార్జి బేరి శీన, మాజీ ఉప సర్పంచ్ మణి, సుధాకర్‌రెడ్డి, మ్యూజికల్ శివ, రామలింగారెడ్డి, కేశవరెడ్డి, క్రిష్టారెడ్డి, ఆలయ సిబ్బంది, గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

పెన్షన్ సొమ్ముతో రచ్చబండలు ఏర్పాటు

రాజంపేట, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): సుమారు 70 ఏళ్ల వయసులో కేతా చెంచురెడ్డికి ప్రభుత్వం ఇస్తున్న పెన్షన్‌ను పదిమందికీ ఉపయోగ పడేలా పనులు చేయిస్తున్నారు. పెన్షన్‌గా నాలుగు వేల రూపాయల పెన్షన్‌తో గ్రామ పరిసరాల్లో, ఆలయాల సముదాయల్లో, బస్ షెల్టర్ల వద్ద, రచ్చబండలు ఏర్పాటు చేస్తున్నారు. ఇలా పదికి పైబడి రచ్చ బండలు ఏర్పాటు చేసి అందరికీ ఆదర్శప్రాయమవుతున్నారు. వివరాల్లోకెళితే...

పుల్లంపేట మండలం కేతావాండ్లపల్లె(దిగువపల్లె గ్రామం) వాసి కేతా చెంచురెడ్డికి ప్రభుత్వం వృద్ధాప్య పెన్షన్ ప్రస్తుతం రూ.4 వేలు ఇస్తోంది. తనకు పదేళ్ల నుంచి ప్రభుత్వం ఇచ్చే ఈ పెన్షన్‌ను పది మందికి ఉపయోగపడేలా చేయాలన్నది ఆలోచన. చిన్నతనంలో ఎక్కడ వచ్చినా బోర్లు, గ్రామ చావిడిలు, రచ్చ బండలు ఉండేవి. అక్కడ పెద్ద పెద్ద చెట్లు ఉండేవి. అక్కడ గ్రామస్తులు అంతా కూర్చుని కబుర్లాడుకుంటూ కులాశాగా ఉండేవారు. పిడస తినడం, రచ్చబండ వద్దకు రావడం, ఆత్మీయులతో సరదాగా గడిపేవారు. ఈ రచ్చ బండలు గ్రామాల్లో ఐక్యతను తీసుకొస్తాయి. అయితే ప్రస్తుతం పుల్లంపేట - చిట్వేలి ఘాట్ రోడ్డు నట్టినడి అడవిలో అంబుల వీరయ్య ఆలయం ఉంది. ఇక్కడికి ఎందరో వస్తుంటారు. వారు కూర్చోవడానికి చిన్న బండ కూడా లేదు.



అడవిలో అంబుల వీరయ్య దేవాలయం వద్ద కేతా చెంచురెడ్డి కట్టిస్తున్న రచ్చబండ ఇన్‌సెట్‌లో చెంచురెడ్డి

అందుకే ఇక్కడ నేను పోగు చేసుకున్న పెన్షన్ సొమ్ము రూ.60 వేలతో మూడు నెలలుగా కష్టపడి ఇక్కడే ఉంటూ రచ్చబండ కట్టిస్తున్నా. సమీపం లో చుక్కనీరు లేకున్నా 10 కిలోమీటర్ల నుంచి ట్యాంకర్ల ద్వారా నీరు, సిమెంటు, ఇటుకలు, బండలు, మట్టి, రాళ్లను పోగు చేసుకుని ఆ అడవిలో రచ్చబండ నిర్మాణాన్ని పూర్తి చేశాడు. ఈ విషయమై అటువైపు వెళుతున్న ఆంధ్రజ్యోతి ఇంత అడవిలో రచ్చబండ నిర్మాణంపై చెంచురెడ్డితో మాట్లాడితే ఆయన చెప్పిన మాటలు ఆశ్చర్యాన్ని గొలిపాయి. ఇప్పటికే సుమారు 10కి పైబడి రచ్చబండలు కట్టించాను. పుల్లంపేట మండలం వేల్పులవారిపల్లె, కొమ్మనవారిపల్లె, అయ్యప్ప ఆలయం, తిమ్మయ్యగారిపల్లె, ఆంజనేయస్వామి గుడి, తుమ్మారెడ్డి తోపు ఇలా అనేక గ్రామాల్లో రచ్చబండలు కట్టించాను. ఏదో తను కష్టపడి సంపాదించిన సొమ్ముతో బిడ్డలు పంపే సొమ్ముతో పొట్ట పోసుకుంటున్నా ఈ పెన్షన్ సొమ్మును పది మందికీ ఉపయోగపడుతూ పది కాలాల పాటు పేరుండేలా ఈ రచ్చబండలు కట్టిస్తున్నా. ప్రభుత్వ సొమ్ముతో పది మందికి ఉపయోగపడే ఇలాంటి రచ్చబండలు ఎంతో బాగుంటాయన్నది నా ఆలోచన అంటూ తనదైనశైలిలో తన ఆనందాన్ని పంచుకున్నాడు చెంచురెడ్డి.

గేటు మీద పడి విద్యార్థికి గాయాలు



పెద్దతిప్పసముద్రం ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాల విద్యార్థిపై గేటు పడడంతో గాయాలయ్యాయి. పీటీఎం మండలం కందుకూరులో చోటుచేసుకున్న సంఘటనపై వివరాల్లో కెళితే.... కందుకూరు వాసి ముబారక్ కుమారుడు అబ్దుల్ మతీన్ (6) కందుకూరు ఎంపీపీ పాఠశాలలో 1వతరగతి చదువుకుంటున్నాడు. రోజు లాగా పాఠశాలకు వెళ్లాడు. పాఠశాల నుంచి ఇంటికి వచ్చే క్రమంలో ప్రధాన గేటు మీద పడడంతో విద్యార్థికిగాయాలయ్యాయి. విద్యార్థి తల్లిదండ్రులకు కనీస విషయం తెలపకుండా, విద్యార్థిని పాఠశాల ప్రధానోపాధ్యాయులు మరో విద్యార్థిని వెంట బెట్టి ఇంటికి పంపించేశాడని కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పిల్లలపై ఉపాధ్యాయులకు బాధ్యత లేదా అంటూ విద్యార్థుల తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. గాయపడిన విద్యార్థిని కుటుంబ సభ్యులు బి.కొత్తకోట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించినట్లు తెలిపారు. వైసీపీ ప్రభుత్వంలో నాడు -నేడు ద్వారా చేసిన పనులను నాసిరకంగా చేపట్టడంతోనే ఇలా ప్రమాదాలు జరుగుతున్నాయని కనీసం ఇప్పటికైనా ఇలాంటివి పునరావృత్తం కాకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.

మద్యం దరఖాస్తులకు నేడే చివరి రోజు



రైల్వేకోడూరు రూరల్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): గీత, ఉప కులాలకు కేటాయించిన మద్యం దుకాణాలకు దరఖాస్తు చేసేందుకు నేడే చివరి రోజు అని రైల్వేకోడూరు ఎక్సైజ్ సీఐ తులసి తెలిపారు. జిల్లాలో 11 మద్యం షాపులు రాయచోటి మున్సిపాలిటీ (గౌడ్), రాజంపేట మున్సిపాలిటీ (ఈడిగ), మదనపల్లి మున్సిపాలిటీ (ఈడిగ), రామసముద్రం (ఈడిగ), వీరబల్లి(ఈడిగ), బి.కొత్తకోట రూరల్ (గౌడ్), నిమ్మనపల్లి(ఈడిగ), తంబళ్లపల్లి (ఈడిగ), నందలూరు(గౌడ్), కలకడ (ఈడి గ), పీలేరు(గౌండ్ల) దరఖాస్తులు స్వీరిస్తున్నట్లు పేర్కొన్నారు. ఏ షాపునకు దరఖాస్తు చేయదలచినా ఏ ఎక్సైజ్ స్టేషన్‌లో, ఆన్‌లైన్‌లో కూడా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

ఆరుగురు ఎర్రచందనం స్మగ్లర్ల అరెస్ట్

తొమ్మిది ఎర్రచందనం దుంగలు స్వాధీనం



పట్టుబడ్డ దుంగలు, స్మగ్లర్లతో ఫారెస్టు అధికారులు

వీరబల్లి, ఫిబ్రవరి4(ఆంధ్రజ్యోతి): వీరబల్లి ఫారెస్టు బీట్ పరిధిలో ఆరుగురు ఎర్రచందనం స్మగ్లర్లను అరెస్టు చేసి 9 ఎర్రచందనం దుంగలను టాస్క్‌ఫోర్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ హెడ్ సుబ్బరాయుడు ప్రత్యేక కార్యాచ రణ మేరకు టాస్క్‌ఫోర్సు ఎస్పీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో డీఎస్పీ బాలిరెడ్డి మార్గనిర్దేశకంలో ఆర్‌ఐ (ఆపరేషన్స్) సురేశ్‌కుమార్‌రెడ్డికి చెందిన ఆర్‌ఎస్‌ఐ లింగాధర్ టీం, ఎఫ్‌బీఓ అనిల్‌కుమార్‌తో కలిసి సోమవారం వీరబల్లి అటవీ ప్రాంతంలో కూంబింగ్ చేపట్టారు. వీరు ఆ ప్రాంతంలోని ఎంట్రీ ఎగ్జిట్ పాయింట్లను తనిఖీ చేసుకుంటూ వెళుతుండగా ఝరికోన వద్ద కొందరు ఎర్రచందనం దుంగలను మోసుకుని వెళుతూ కనిపించారు. వారిని చుట్టుముట్టే ప్రయత్నం చేయగా కొందరు పారిపోగా వెంబడించి ఆరుగురిని పట్టుకోగలిగామన్నారు. ఆ ప్రాంతంలో 9 ఎర్రచందనం దుంగలు లభించాయి. పట్టుబడిన వారిని తమిళనాడు రాష్ట్రానికి చెందిన వారిగా గుర్తించారు. దుంగలను తిరుపతి టాస్క్‌ఫోర్సు పోలీసు స్టేషన్‌కు తరలించారు. పారిపోయిన వారి కోసం ముమ్మరంగా గాలిస్తున్నారు. ఎస్‌ఐ ఎండీ రఫీ కేసు నమోదు చేశారు. డీఎస్పీలు శ్రీనివాసరెడ్డి, ఎండీ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను తమ పిల్లలుగా చూసుకోవాలి



సిద్దవరం కస్తూర్బా పాఠశాల సౌకర్యాలపై ఆరా తీస్తున్న డిప్యూటీ డైరెక్టర్ దేవరాజు

పెద్దమండ్యం, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి) విద్యార్థులను తమ పిల్లలాగా చూసుకోవాలని, వారి విద్యాభివృద్ధికి సమష్టిగా కృషి చేయాలని కస్తూర్బా బాలిక ల పాఠశాల డిప్యూటీ డైరెక్టర్ దేవరాజు సూచించారు. మండలంలో మంగళవారం కస్తూర్బా బాలికల పాఠశాల రాష్ట్ర డైరెక్టర్ దేవరాజు, జిల్లా జీసీడీఓ మధుమతి పర్యటించారు. సిద్దవరం కస్తూర్బా పాఠశాలలో మధ్యాహ్నం భోజనం తనిఖీ చేసి పాఠశాల సౌకర్యాలపై ప్రిన్సిపాల్ రాణికుమారిని అడిగి తెలుసుకున్నారు. కాగా విద్యార్థినులకు పురుగులు పటిన అన్నం పెడు తున్నారని, విద్యార్థినుల చేత మరుగుదొడ్లు కడిగిస్తున్నారని గతవారం వైరల్ అయిన ఫొటోలు డీఈఓ సుబ్రమణ్యం దృష్టికి వెళ్లాయి. ఈ వ్యహారంపై వివరణ కోరుతూ ప్రిన్సిపాల్‌కు డీఈఓ సోకాజ్ నోటీసు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ వెట్టిచాకిరి ఫొటోలు ఎప్పుడు, ఎవరు తీశారు, ఎందుకు వైరల్ చేశారని అందరిలో చర్చనీయాంశమైంది. పెద్దమండ్యం మోడల్ స్కూల్ విద్యార్థులతో వారు మాట్లాడుతూ పది, ఇంటర్ పరీక్షల్లో విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధనకు సూచనలు ఇచ్చారు. ఎంఈఓలు మనోహర్, రామకృష్ణ, ప్రిన్సిపాల్ రామాంజులు నాయక్, అధ్యాపకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉరి వేసుకుని రైతు మృతి



నరసింహులు మృతదేహం (ఇన్‌సెట్‌లో ఫైల్‌ఫొటో)

మదనపల్లె అర్బన్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి):అనుమానాస్పద స్థితిలో చెట్టుకు ఉరివేసుకుని రైతు మృతి చెందడం సంచలనమైంది. పొన్నూటిపాళెంలో సోమవారం రాత్రి చోటు చేసుకున్న ఘటనపై తాలుకా సీఐ కళావెంకటరమణ తెలిపిన వివరాల్లోకెళితే... పిచ్చిలవారిపల్లె వాసి నరసింహులు(65) 20 ఏళ్లుగా తన భూమిలోకి వెళ్లడానికి అదే గ్రామానికి చెందిన కొందరు దారి ఇవ్వడంలేదని గొడవలు జరుగుతున్నాయి. ఇందులో భాగంగానే సోమవారం దారి సమస్య తీర్చాలని మదనపల్లె సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్‌కు స్పందనలో వినతిపత్రం అందజేశారు. విషయం తెలుసుకు న్న ప్రత్యర్థులు వారు పొలంలోకి పోకుండా సోమవారం సాయంత్రానికి అడ్డుగా వేశారు. ఏమి జరిగిందో ఏమో తెలియదు గానీ ప్రత్యర్థుల పొలంలోని పెద్ద చెట్టుకు ఉరేకుని మృతి చెందాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడం తో తాలుకా పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. మృతుని భార్య రెడ్డెమ్మ ఫిర్యాదు మేరకు తాలుకా సీఐ అనుమానాస్పద స్థితి కేసు నమోదు చేసిదర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. మృతునికి ఒకకూతురు, ఇద్దరు కుమారులు ఉన్నారు.

సకల దేవతలకు ఆహ్వానం

- ధ్వజారోహణంతో ప్రారంభమైన వెంకన్న బ్రహ్మోత్సవాలు
- వైభవంగా స్వామి, అమ్మవార్లకు పల్లకీ ఉత్సవం



పల్లకీ సేవలో స్వామి వారు

తంబళ్లపల్లె, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): సకల దేవతలకు ఆహ్వానం పలుకుతూ ధ్వజారోహణతో ప్రసన్న వేంకటరమణ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. కోసువారిపల్లెలో కొలువైన ప్రసన్న వేంకటరమణ స్వామి ఆలయంలో మంగళవారం ఉదయం వేద పండితులు ఆలయ ధ్వజస్తంభం పైకి గరుడ ధ్వజాన్ని శాస్త్రోక్తంగా ఎగురవేశారు. వేకువనే సుప్రభాతంతో స్వామి వారిని మేల్కొలిపి ధూప, దీప నైవేద్యాలు సమర్పించి నిత్య కైంకర్యాలు పూర్తిచేశారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత వేంకటరమణ స్వామి ఉత్సవమూర్తుల సమక్షంలో వేదపండితుల మంత్రోచ్చారణలు, భక్తుల గోవింద నామస్మరణ మార్మోగింది. సకల దేవతలు, అష్టదిక్పాలకులు, సప్తమాతృకలు, ప్రాణకోటిని బ్రహ్మోత్సవాలకు ఆహ్వానించేందుకు ధ్వజారోహణం ఘట్టం నిర్వహిస్తారని ప్రాశస్త్యం. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత స్వామి వారి ఉత్సవర్లకు పాలు, పెరుగు, తేనే, కొబ్బరినీళ్లు, పసుపు, చందనంతో వేడుకగా స్నపనతిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాల నడుమ శ్రీదేవి, భూదేవి సమేత స్వామి వారికి పల్లకీ ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం శేషవాహన సేవ, రా త్రి హంసవాహన సేవలు నిర్వహించనున్నారు. సూపరింటెండెంట్ మునిబాలకుమార్, వేదపండితులు పాల్గొన్నారు.

రైలు కింద పడి ఆత్మహత్య

చంద్రగిరి, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): రైలు కిందపడి రవికుమార్‌యాదవ్(58) ఆత్మహత్య చేసు కున్నాడు. గుర్రంకొండ మండలం అరిగివారిపల్లెకు చెందిన రవికుమార్‌యాదవ్ మంగళవారం సాయంత్రం వెంటాద్రి ఎక్స్‌ప్రెస్ రైలు వస్తుండగా పట్టాలపై పడుకున్నాడు. పోలీసులు వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. మృతదేహం నుజ్జు నుజ్జు అవ్వడంతో రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. మృతుడు బంధువులు రవి కనబడడంలేదని గాలిస్తున్నారు. సెల్‌ఫోన్ సిగ్నిల్స్ ఆధారంగా శ్రీనివాసమంగాపురం చేరుకున్నారు. రవి ఆత్మహత్యకు కారణాలు తెలియలేదు.

పారదర్శకంగా పరిష్కరించాలి

రెవెన్యూ సదస్సు అర్జీలను వెంటనే పరిష్కరించండి : రెవెన్యూ అధికారులతో కలెక్టర్ చామకూరి శ్రీధర్



బ్రాహ్మణపల్లె వద్ద భూములను పరిశీలిస్తున్న కలెక్టర్ శ్రీధర్, సబ్‌కలెక్టర్ నిదియాదేవి

రాజంపేట, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నెల రోజులు నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన అర్జీలను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఆదేశించారు. మంగళవారం రాజంపేట ఎంపీడీఓ కార్యాలయంలో రెవెన్యూ, ఇతర అధికారులతో సబ్‌కలెక్టర్ నిధియాదేవితో కలిసి సమీక్షించిన ఆయన మాట్లాడుతూ రెవెన్యూ సదస్సుల్లో 200 దరఖాస్తులు అందాయని వీటిని వెంటనే పరిష్కరించాలన్నారు. భూవివాదాలపై 26 వినతిపత్రా లు అందాయని, వీటిని పారదర్శకంగా పరిష్కరించాలన్నారు. అన్నదమ్ములు, సరిహద్దు, ముటేషన్స్ సమస్యలపై ఎక్కువ అర్జీలు అందాయని వాటిని పారదర్శకంగా పరిష్కరించాలన్నారు. నిక్కచ్చిగా పనిచేసేటప్పు డు ఒత్తిడులు రావడం సహజమని, అంతమాత్రాన అధైర్యపడకుండా నిబంధనల మేరకు పని చేయాలన్నారు. సమష్టిగా పనిచేసినప్పుడే సమస్యను పరిష్కరించవచ్చునని, ఎక్కువ ఒత్తిడి ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే వెనువెంటనే పరిష్కరిస్తామన్నారు.

బ్రాహ్మణపల్లె భూములు పరిశీలన

బ్రాహ్మణపల్లె సర్వేనంబరు 101/3లో అందిన ముటేషన్ సమస్యను క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి ఈ సమస్యను అక్కడికక్కడే పరిష్కరించారు. కార్యక్రమంలో తహసీల్దారు పీర్‌మున్నీ, ఎంపీడీఓ వరప్రసాద్‌రావు, వీఆర్వోలు, సర్వేయర్‌లు పాల్గొన్నారు.

విద్యార్థులకు అనుకూలంగా పునర్‌వ్యవస్థీకరణ

విద్యార్థులకు అనుగుణంగా పాఠశాలల పునర్ వ్యవస్థీకరణను చేపట్టాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ విద్యాశాఖాధికారులను ఆదేశించా రు. రాజంపేట ఎంపీడీఓ కార్యాలయంలో రాజంపేట, నందలూరు మండల ఎంఈఓలు, ప్రధానోపాధ్యాయులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పాఠశాలల పునర్‌వ్యవస్థీకరణ కారణంగా ఏ విద్యార్థి నష్టపోకుండా భవిష్యత్‌లో కూడా వారికి ఉపయోగ పడేవిధంగా పాఠశాల పునర్‌వ్యవస్థీకరణ ప్రక్రియను చేపట్టాలన్నారు. విద్యార్థులకు, ఉపాధ్యాయులకు ఎటువంటి ఇబ్బంది లేకుం డా చేపట్టాలన్నారు. విద్యార్థులు పాఠశాలలకు వచ్చే రాకపోకలు, సౌకర్యాలను దృష్టిలో పెట్టుకుని అదేవిధంగా ఉపాధ్యాయులకు ఎటువంటి నష్టం జరగకుండా అందుబాటు లో ఉండే భవనాలు, ఇతర మౌలిక వసతులు వృథా కాకుండా వాటిని పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకునేలా పునర్‌వ్యవస్థీకరణ నిర్వహించాలన్నారు.

రీసర్వే పనులు పూర్తిచేయాలి : కలెక్టర్

రాయచోటి (కలెక్టరేట్), ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): మండల సర్వేయర్లు ప్రత్యేక దృష్టి సారించి పెండింగ్‌లో ఉన్న రీసర్వే పనులను పూర్తి చేయాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో తహసీల్దార్లు, ఎంపీడీఓలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రీసర్వే, రెవెన్యూ సదస్సుల అర్జీలు, పీజీఆర్ఎస్ అర్జీలు, భూసేకరణ తదితర అంశాలపై సమీక్షించిన కలెక్టర్ మాట్లాడుతూ రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన అర్జీలు, పీజీఆర్ఎస్ ద్వారా వచ్చిన అర్జీలను త్వరగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. చాలా మండలాల్లో రెవెన్యూ సదస్సుల ద్వారా వచ్చిన అర్జీలు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని త్వరగా పరిష్కరించాలని సూచించారు. రీసర్వే గురించి మాట్లాడుతూ మండల సర్వేయర్లు అందరూ దృష్టి సారించి పెండింగ్‌లో ఉన్న రీసర్వే పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. సబ్‌కలెక్టర్లు, ఆర్డీఓను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రతి వారం ఎంపీడీఓలు, తహసీల్దార్లతో ఈ అంశాలపై సమీక్ష నిర్వహించి పురోగతి సాధించాలన్నారు. సమావేశంలో సంయుక్త కలెక్టర్ ఆదర్శ్‌రాజేంద్రన్, డీఆర్ఓ మధుసూదనరావు, సబ్ కలెక్టర్లు, ఆర్డీఓ, సర్వే శాఖ ఏడీ, తహసీల్దార్‌లు, ఎంపీడీఓలు తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురిపై కేసులు నమోదు

చాపాడు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని విశ్వనాథపురం గ్రామానికి చెందిన భాస్కర్‌రెడ్డి, అతని భార్య, కొడుకు శివారెడ్డిపై కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. వివరాల మేరకు.. కుచ్చుపాప గ్రామం వద్ద భాస్కర్‌రెడ్డి, పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన సూర్యనారాయణరాజు కలిసి మైదుకూరు మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి వద్ద సుమారు 40 ఎకరాల భూమిని కౌలుకు తీసుకున్నారు. ఈభూమిలో రొయ్యలు పెంపకం చేపట్టారు. ఈ నేపథ్యంలో వీరిద్దరి మధ్య మనస్పర్థలు రావడంతో భూమిలోని చెరువును చెరిసగం పంచుకున్నారు. మంగళవారం సూర్యనారాయణరాజు తనకు చెందిన చెరువులోని రొయ్యలను వ్యానులో ప్రొద్దుటూరు పట్టణానికి తీసుకుపోతుండగా భాస్కర్‌రెడ్డి, అతని భార్య, కొడుకు శివారెడ్డి అడ్డుకున్నారు. తమకు ఇవ్వాల్సిన పాత బాకీ రూ.లక్ష ఇవ్వాలని సూర్యనారాయణ రాజును నిలదీయడంతో వీరి మధ్య వాగ్వాదం జరిగింది. ఈ నేపథ్యంలో శివారెడ్డి ఆగ్రహంతో సూర్యనారాయణరాజును కొట్టాడు. ఈ మేరకు పై ముగ్గురిపై కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

బీటెక్ విద్యార్థిని ఆత్మహత్య



ప్రొద్దుటూరు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు మండలం నంగనూరుపల్లెకు చెందిన మేకల వైష్ణవి (19) అనే విద్యార్థిని ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసుల వివరాల మేరకు.. చాపాడు మండలం పల్లవోల వద్ద ఉన్న ఓ ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ రెండో సంవత్సరం చదువుతున్న వైష్ణవి నెలసరి కడుపు నొప్పితో తరుచూ బాధపడుతుండేది. ఎక్కడికి వెళ్లినా నొప్పి తగ్గకపోవడంతో మంగళవారం ఉదయం ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. వైష్ణవి తల్లి లావణ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు రూరల్ పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఉద్యోగి మృతి



వేంపల్లె, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నందిపల్లె సమీపంలో కడప-పులివెందుల రోడ్డులో జరిగిన ప్రమాదంలో రమేష్‌యాదవ్ (38) అనే ఐటీఐ ఉద్యోగి మృతి చెందాడు. వేములకు చెందిన శ్రీనివాసులు కుమారుడు రమేష్‌యాదవ్ వేముల ప్రభుత్వ ఐటీఐలో కాంట్రాక్టు పద్ధతిలో ఆఫీస్ సబార్డినేట్‌గా పనిచేస్తున్నారు. పెండ్లిమర్రి మండలం తిప్పరాజుపల్లెకు చెందిన శోభారాణితో పదేళ్లక్రితం వివాహమైంది. వీరికి ఏడాది వయసున్న పాప ఉంది. అత్తగారి ఊరైన తిప్పరాజుపల్లెలో నివాసముంటూ వేముల ఐటీఐకి వెళ్లి వచ్చేవాడు. రోజు మాదిరిగానే మంగళవారం రాత్రి వేముల నుంచి తిప్పరాజుపల్లెకు బైకులో వెళ్తుండగా నందిపల్లె వద్ద ట్రాక్టర్‌ను ఢీకొనడంతో తలకు గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. సీఐ సురేష్‌రెడ్డి, ఎస్ఐలు వివరాలు సేకరించారు.

వ్యక్తిపై ఆటోడ్రైవర్ కత్తితో దాడి

బద్వేలు టౌన్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఆర్టీసీ బస్టాండులో ఖాజారసూల్ అనే వ్యక్తిని ఆటోడ్రైవర్ కత్తితో పొడిచిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. ఆటోలో బస్టాండుకు వచ్చిన ఖాజారసూల్‌ను ఆటోడ్రైవర్ డబ్బులు అడగగా ఇప్పుడు లేదు తరువాత ఇస్తాననడంతో ఇద్దరికి మాటామాటా పెరిగింది. దీంతో ఆటోడ్రైవర్ ఆటోలో ఉన్న కత్తితీసుకొని ఖాజారసూల్ పొట్టలో పొడిచాడు. వెంటనే స్థానికులు గాయపడిన వ్యక్తిని ఆటోలో ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం కడప రిమ్స్‌కు తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ద్వారకానగర్‌లో చోరీ

ప్రొద్దుటూరు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): గోపవరం మండలం ద్వారకానగర్‌లో రమణయ్య అనే వ్యక్తి ఇంట్లో సోమవారం రాత్రి 10 గంటలకు చోరి జరిగింది. రూరల్ ఎస్ఐ సురేష్ వివరాల మేరకు.. రమణయ్య బంధువులకు సంబంధించి దినకర్మ వుండటంతో సోమవారం ప్రొద్దుటూరు టౌన్‌కు కుటుంబ సమేతంగా వెళ్లారు. రాత్రి 10 గంటలకు ఇంటికి తిరిగి రాగా తలుపు తెరిచి వుండటంతో ఇంట్లోకి వెళ్లగా.. అప్పుడే ముగ్గురు వ్యక్తులు పరారయ్యారని తెలిపారు. ఇంట్లో బీరువాను పరిశీలించి బంగారు వస్తువులు పోయినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు విచారిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

దుర్భరంగా... చేనేతల బతుకులు

తెల్లార్లు ఇంటిల్లిపాది కష్టపడినా కనీసం కూలీ కూడా గిట్టు బా టు కావడం లేదు... ఎన్ని ప్రభుత్వాలు మారుతున్న మా బతుకులు మాత్రం మారడం లేదు. ఎన్నికల సమయంలో మాత్రం నాయకులు అది చేస్తాం.. ఇది చేస్తాం అని చెబుతారు.. ఆ తర్వాత ఇటు వైపు కన్నెత్తి చూడరు.. ఏళ్లు గడుస్తున్నా మాకు కష్టాలు కన్నీళ్లు తప్పడం లేదు.. ఇది చేనేత కార్మికుల ఆవేదన.



గుంతమగ్గంలో నేత నేస్తున్న కార్మికుడు

- ఇంటిల్లిపాది కష్టపడినా కూలి కూడా పడటం లేదని ఆవేదన
- గిట్టుబాటు ధర కల్పించాలి
- పెరిగిన ధరలకు అనుగుణంగా పనిముట్లు అందించాలి
- చేనేత సంఘాల నాయకుల డిమాండ్

జమ్మలమడుగు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): చేనేత పరిశ్రమ దుర్భరస్థితిలో ఉంది. ప్రస్తుతం చేనేతలకు గడ్డుకాలం ఏర్పడిందని... కరోనా సమయం నుంచి ఇప్పటి వరకు చేనేతలపై ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని పలువురు చేనేత సంఘాల నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల సమయంలో ఓట్లకు మాత్రమే చేనేతలను ఉపయోగించుకుని తర్వాత ఆ పరిశ్రమ పట్లకానీ, కార్మికుల సమస్యలను పట్టించుకోవడం లేదంటున్నారు. ప్రస్తుతం (గత నాలుగు నెలల నుంచి) పట్టు కిలో వెయ్యి రూపాయలు ధర పెరిగిందని, గతంలో రూ.4,400 ఉంటే ఇటీవల రూ.5,500లకు ధర పెరిగింది. దీంతో పట్టు నేత కార్మికులకు ఇంటిల్లిపాది కష్టపడినా గిట్టుబాటు ధర లేదని నేతన్నలు వాపోతున్నారు. ఇక కాటన్ (నూలు) ఒక లడిగె రూ.75 ధర ఉంది. ఒక చీరెకురెండు లడిగెల ఒక కట్టు ఖర్చు అవుతుంది. అయితే చేనేతలకు ఇచ్చే కూలి ఒక చీరెకు రూ.120 మాత్రమే రకాన్ని బట్టి ఉందని తెలిపారు. దీంతో తెల్లార్లు ఇంటిల్లిపాది కష్టపడినా కనీసం కూలి కూడా గిట్టుబాటు కావడం లేదని చేనేత కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తు న్నారు. దీంతో ప్రస్తుతం పెరిగిన నిత్యావసర సరుకుల ధరలకు ఏమి కొనలేక, తినలేక ఇబ్బంది పడుతున్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం సబ్సిడీ ధరలకు అవసరమైన పనిముట్లు అందించి ఆదుకోవాలని చేనేతలు, నేత కార్మిక నాయకులు కోరుతున్నారు.

చేనేత పరిశ్రమను ఆదుకోవాలి



చేనేత పరిశ్రమ సంక్షోభంలో ఉంది. కార్మికులకు సక్రమంగా పనిలేక కొందరు వేరే వృత్తులోకి మారడం, మరికొందరు చేనేత రంగం వదిలి వెళ్లలేక ఇబ్బంది పడుతున్నారు. ప్రస్తుత ప్రభుత్వాలు చేనేత కార్మికులను ఆదుకునేందుకు సబ్సిడీకి పనిముట్లు ఇవ్వాలి. జీఎస్టీ రద్దు చేయడంతో పాటు సంక్షేమ పథకాలు అమలు చేయాలి. ఉత్పత్తులను ప్రభుత్వమే కొనుగోలు చేయాలి. ఉచిత విద్యుత్తు వెంటనే అమలు చేయాలి. నూలు, పట్టు ధరలు తగ్గించాలి.

- కాటా రామదాసు,
చేనేత ఐక్యవేదిక జాతీయ ఉపాధ్యక్షుడు

గిట్టుబాటు ధరకు ఉత్పత్తులు కొనేలా చూడాలి

చేనేత పరిశ్రమలో నేసిన ఉత్పత్తులను ఆప్కోసంస్థ ద్వారా గిట్టుబాటు ధరకు ఉత్పత్తులు కొనేలా చూడాలని చేనేత సంఘాల నాయకులు కోరుతున్నారు. అలాగే సబ్సిడీకి పనిముట్లు, పాస్‌పుస్తకాలు తదితరా



పవర్‌లూమ్ మగ్గం నేస్తున్న నేత కార్మికుడు

లు అందించాలని, ఉచిత బీమాతో పాటు ఆరోగ్యబీమా సౌకర్యం కల్పించాలని కోరుతున్నారు. ఇక కేంద్ర ప్రభుత్వం నేతన్నలకు, వారి అభివృద్ధి కోసం పరిశ్రమ ముందుకు వెళ్లాలంటే జీఎస్టీ రద్దు చేయాలని కోరుతున్నారు. జీఎస్టీ పెట్టినప్పటి నుంచి చేనేత పరిశ్రమ పూర్తిగా దెబ్బతిందని.. ధరలు పెరిగి జీఎస్టీ కట్టలేక పెట్టుబడులు లేక మాస్టర్ వీవర్స్ ఇబ్బందులు పడుతున్నారు. చేసేది లేక కొందరు అదే పరిశ్రమపై ఊగిసలాడుతూ ఇబ్బందులు పడుతున్నారు. గత ప్రభుత్వంలో చేనేత కార్మికునికి నేతన్న నేస్తం కింద ఏడాదికి రూ.24 వేలు ఇచ్చేదని.. కూటమి ప్రభుత్వం ఆదిశగా పెంచి ఇవ్వాలని కోరుతున్నారు. చేనేత కార్మిక రంగానికి కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు 200 యూనిట్లు ఉచిత విద్యుత్తు అమలు చేయాలని కోరుతున్నారు.

క్యాన్సర్ రాకుండా అప్రమత్తంగా ఉండాలి

కడప కలెక్టరేట్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): క్యాన్సర్ ప్రమాదకరమైన వ్యాధి అని, అది మన దరిదాపులకు రాకుండా అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ నాగరాజు పిలుపునిచ్చారు. మంగళవారం ప్రపంచ క్యాన్సర్ దినం సందర్భంగా డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో వైద్యాధికారులు, సిబ్బందికి సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా డీఎంఅండ్‌హెచ్‌ఓ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం క్యాన్సర్ నివారణకు అనేక చర్యలు చేపడతోందన్నారు. ఇంటివద్దనే అందరికీ ఆరోగ్యం అందించాలనే దృక్పథంతో ఎన్‌సీడీ 3.0 సర్వే ద్వారా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో, పట్టణ ఆరోగ్య ప్రాథమిక కేంద్రాల వైద్యాధికారులతో, ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్ఎంలకు క్యాన్సర్ స్కీనింగ్‌పై శిక్షణ ఇచ్చామన్నారు. 18 సంవత్సరాలు పైబడిన స్త్రీ, పురుషులకు ఇంటింటా క్యాన్సర్, సర్వే కార్యక్రమం నిర్వహించామన్నారు. ప్రతి స్త్రీకి రొమ్ము క్యాన్సర్, 30 ఏళ్లు పైడిన మహిళలకు గర్భాశయం ముఖ ద్వారం పరీక్షలు, నోటి క్యాన్సర్‌తో పాటు రక్తపోటు వంటి వ్యాధులకు ఉచితంగా రక్త, ఆరోగ్య పరీక్షలు చేశామన్నారు. మంగళ, గురువారం రోజుల్లో స్పెషలిస్ట్ డాక్టర్లతో క్యాన్సర్ వ్యాధి రాకుండా అప్రమత్తం చేస్తున్నామన్నారు. ఆహారపు అలవాట్లు, జీవనశైలి, వ్యాయామంపై ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో డీఐఓ డాక్టర్ ఉమామహేశ్వరరావు, డీపీఎంఓ డాక్టర్ శశిభూషణరెడ్డి, డీఎల్ఏటీసీటీఓ డాక్టర్ సగిలి రవిబాబు, వైద్యాధికారులు, సూపర్‌వైజర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ నాగరాజు, వైద్యసిబ్బంది

విస్తరణ సేవలను రైతులకు అందించాలి

సికెదిన్నె, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): కృషి విజ్ఞాన కేంద్రం విస్తరణ సేవలను రైతులకు అందించాలని ఆచార్య ఎన్జీరంగా విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకులు డాక్టర్ జి.శివనారాయణ తెలిపారు. కృషి విజ్ఞాన కేంద్రంలో జరుగుతున్న శాస్త్రీయ సలహా మండలి సమావేశానికి మంగళవారం ఆయన హాజరై మాట్లాడుతూ వ్యవసాయ రంగం సంక్షోభంలో ఉందని, వాతావరణంలో మార్పులకు అనుగుణంగా తట్టుకునే రకాలు, సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవడం కోసం ప్రభుత్వం కృషి విజ్ఞాన కేంద్రం ఏర్పాటు చేసిందన్నారు. కేవీకేలు రైతుల స్థితిగతులను మార్చడానికి ఎంతగానో తోడ్పడుతాయని.. రైతులకు పరిజ్ఞానం పెంచడానికి అనేక శిక్షణ కార్యక్రమాలు, సాంకేతిక కార్యక్రమాలను వివిధ దత్తత గ్రామాల్లో ఆచరించడం జరుగుతుందన్నారు. తిరుపతి ప్రాంతీ య వ్యవసాయ పరిశోధన స్థానం సహ పరిశోధన సంచాలకు లు డాక్టర్ వి.సుమతి మాట్లాడుతూ రైతులు ఎదుర్కొంటున్న సమస్య లు, వ్యవసాయం, అనుబంధ సంఘాల అధికారుల నుంచి వచ్చే సలహాలు ఆధారంగా రాబోయే సంవత్సరానికి కార్యాచరణను, ప్రణాళికలను సిద్ధం చేసుకోవడానికి ఈ కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. అనంతరం కేవీకే సమన్వయకర్త వీరయ్య, ఏరువాక సమన్వయకర్త అంకయ్యకు మార్‌లు 2024-25 సంవత్సరానికి గాను సాధించిన ప్రగతిని, విస్తరణ సేవలను వివరించారు. కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా వ్యవసాయశాఖ అధికారి చంద్రానాయక్, పశుసంవర్ధకశాఖ అధికారి గుణశేఖర పిళ్లై, పులివెందుల అరటి పరిశోధన ప్రధాన శాస్త్రవేత్త శివరామకృష్ణ, వనిపెంట కేవీకే సమన్వయకర్త బాలకృష్ణ, వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త ప్రభాకర్‌రెడ్డి, రైతు శిక్షణ కేంద్రం సహా య సంచాలకులు రమణారెడ్డి, పలువురు శాస్త్రవేత్తలు, రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విస్తరణ సంచాలకులు డాక్టర్ శివనారాయణ

ఎస్ఏఆర్‌టీహెచ్ఐ కోఆర్డినేటర్‌గా డాక్టర్ రెడ్డయ్య

కడప ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): వైవీయూలోని కంప్యూటర్ సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ బి.రెడ్డయ్యను ఎస్ఏఆర్‌టీహెచ్ఐ (స్టూడెంట్స్ అంబాసిడర్ ఫర్ అకాడమిక్ రీ ఫార్మ్ ఇన్‌ట్రాన్స్‌ఫార్మింగ్ హయ్యర్ ఎడ్యుకేషన్) కోఆర్డినేటర్‌గా నియమించారు. విశ్వవిద్యాలయంలోని వీసీ చాంబర్‌లో డాక్టర్ రెడ్డయ్యకు ఉపకులపతి ఆచార్య కె.కృష్ణారెడ్డి, కులసచివులు ఆచార్య పి.పద్మ, ప్రధానాచార్యులు ఎస్.రఘునాథరెడ్డితో కలిసి నియామకపు పత్రాన్ని అందించారు. ఎస్ఏఆర్టీహెచ్ఐ సహాయకులుగా వైవీయూ బీసీడీఈ కోఆర్డినేటర్ వీసీ సంపత్‌కుమార్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. జాతీయ విద్యావిధానం-2020 పట్ల విద్యార్థులకు అవగాహన కల్పించడంతో పాటు విస్తృత ప్రచారంలోకి తీసుకెళ్లేలా చూడాలని అధికారులు కోరారు.

రిమ్స్‌లో ఎంబాల్మింగ్ మిషన్

కడప సెవెన్ రోడ్స్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): డిపార్ట్‌మెంట్ ఆఫ్ అనాటమీ ప్రభు త్వ మెడికల్ కళాశాలలో నూతనంగా ఎంబాల్మింగ్ మిషన్‌ను ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.సురేఖ మంగళవారం ఆవిష్కరించారు. ఈ మిషన్‌ను ఉపయోగించి శరీరంలోకి రసాయనాలను పంపిస్తారు. దీని ద్వారా మానవ శరీరాలను భద్రపరిచి ఎంబీబీఎస్ విద్యార్థులకు ప్రాక్టికల్స్‌కు ఉపయోగిస్తారు. ఈ మిషన్‌ను శాంక్షన్ చేయించినందుకు ప్రిన్సిపల్‌కి అనాటమీ విభాగాధిపతి డాక్టర్ సి.యామినిదేవి కృతజ్ఞతలు తెలిపారు. కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ విజయభాస్కర్‌రెడ్డి, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సునీల్, అనాటమీ డిపార్ట్‌మెంట్ సిబ్బంది, ఎంబీబీఎస్ మొదటి సంవత్సర విద్యార్థులు పాల్గొన్నారు.



ఎంబాల్మింగ్ మిషన్‌ను ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్

డ్రాగా ముగిసిన ఆంధ్ర - హిమాచల్ ప్రదేశ్ మ్యాచ్

కడప స్పోర్ట్స్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): కడప రిమ్స్ సమీప వైఎస్ రాజారెడ్డి ఏసీఏ క్రికెట్ స్టేడియంలో జరుగుతున్న కల్నల్ సీకేనాయుడు ట్రోఫీ (అండర్ 23) నాలుగు రోజుల క్రికెట్ మ్యాచ్ మంగళవారం డ్రాగా ముగిసింది. ఓవర్ నైట్ స్కోరు 30 పరుగులతో తిరిగి రెండో ఇన్నింగ్స్‌కు దిగిన ఆంధ్రజట్టు ఆటకు చివరిరోజైన మంగళవారం తన రెండో ఇన్నింగ్స్‌లో 55.3 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 203 పరుగులు చేసింది. ఓవర్‌నైట్ స్కోరు 19 పరుగులతో నాటౌట్‌గా నిలిచిన రేవంత్‌రెడ్డి తిరిగి బ్యాటింగ్ ప్రారంభించి 47 పరుగుల వద్ద ఔట్ అయ్యారు. దీంతో ఆంధ్ర జట్టు తన మొదటి ఇన్నింగ్స్‌లో 544, రెండో ఇన్నింగ్స్‌లో 203 పరుగులు మొత్తంగా రెండు ఇన్నింగ్స్‌లకు కలిపి 747 పరుగులు చేసింది. ఇందుకు ధీటుగా హిమాచల్‌ప్రదేశ్ జట్టు తన మొదటి ఇన్నింగ్స్‌లో 436 పరుగులు చేయగా.. చివరి రోజు తిరిగి రెండో ఇన్నింగ్స్ చేపట్టి 22.3 ఓవర్లలో ఒక వికెట్ నష్టపోయి 92 పరుగులు చేసింది. ఇందులో యోగ్‌దీప్ ఠాకూర్ 69 పరుగులు చేశారు. దీంతో నిర్వాహకులు మ్యాచ్‌ను డ్రాగా ప్రకటించారు. కాగా మొదటి ఇన్నింగ్స్‌లో ఆంధ్రజట్టుకు ఆధిక్యత లభించింది.

జడ్పీ సర్వసభ్య సమావేశం వాయిదా

కడప రూరల్, ఫిబ్రవరి 4: పార్లమెంట్ సమావేశాలు ఉన్న సందర్భంగా ఈ నెల 7న నిర్వహించాల్సిన జడ్పీ సర్వసభ్య సమావేశాన్ని 8వ తేదీ శనివారం సెలవు రోజు నిర్వహిస్తున్నామని జడ్పీ సీఈవో సి.ఓబులమ్మ తెలిపారు. ఈ మార్పును ప్రజాప్రతినిధులు, అధికారులు గమనించి సర్వసభ్య సమావేశానికి హాజరు కావాలని కోరారు.

మహానాడు కోసం స్థల పరిశీలన

(కడప - ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న మహానాడు కార్యక్రమాన్ని ఈసారి కడపలో నిర్వహించాలని ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధ్యక్షతన జరిగిన పొలిట్ బ్యూరో సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. మే 27, 28, 29 తేదీల్లో మహానాడు నిర్వహించనున్నారు. డీఆర్‌సీ సమావేశంలో పాల్గొనేందుకు జిల్లాకు వచ్చిన ఇన్‌చార్జ్ మంత్రి సవిత పొలిట్ బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డి, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అమీర్‌బాబు, ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి, ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణ చైతన్యరెడ్డిలు కలిసి మహానాడు నిర్వహణకు మంగళవారం స్థలాన్ని పరిశీలించారు. రింగురోడ్డులోని జయరాజ్‌గార్డెన్ సమీపంలో, పులివెందుల రోడ్డులో, ఎయిర్‌పోర్టు పక్కనున్న మూడు చోట్ల స్థలాలను పరిశీలించారు. మహానాడుకు ఏపీ తెలంగాణ నుంచి కాక అండమాన్ నికోబార్, చెన్నై, కర్ణాటక ఇతర ప్రాంతాల నుంచి పెద్దఎత్తున పార్టీ నేతలు, కేడరు తరలివస్తుంది. సభ నిర్వహణ అనంతరం మీటింగ్, వాహన పార్కింగ్‌కు పెద్ద ఎత్తున స్థలం అవసరం అవుతుంది. ఈ నేపథ్యంలో మూడుచోట్ల స్థలాలను పరిశీలించారు. ఇంకా ఏదీ ఫైనల్‌గా నిర్ణయించలేదు.

పార్టీ కోసం కష్టపడ్డ కార్యకర్తలను ఆదుకోండి

టీడీపీ గెలుపు కోసం అహర్నిశలు జెండా మోసిన కార్యకర్తలను ఆదుకోవాలంటూ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి సవితకు పలువురు టీడీపీ నేతలు విజ్ఞప్తి చేశారు. డీఆర్‌సీ సమావేశంలో పాల్గొనేందుకు కడపకు వచ్చిన ఆమె కలవాల్సిందిగా కడప నగరంలో ఉన్న పలువురు టీడీపీ నేతలకు ఫోను చేశారు. దీంతో కొందరు విడివిడిగా కలిసి వారి సమస్యలను ఏకరువు పెట్టారు. మంగళవారం ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో పలువురు కడప టీడీపీ నేతలు కలిశారు. టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వీఎస్ అమీర్‌బాబు, రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు ఎస్.గోవర్ధనరెడ్డి, హరిప్రసాద్, నగర అధ్యక్షుడు సానపురెడ్డి శివకొండారెడ్డి, అలంఖాన్‌పల్లెకు చెందిన టీడీపీ నేతలు లక్ష్మిరెడ్డి, మన్మోహన్ రెడ్డి, పీరయ్య తదితరులు మంత్రిని కలిశారు. అయితే వీరిలో కొందరు తాము పార్టీ కోసం కష్టపడినా గుర్తింపు లేదని, ఇసుక మాఫియా, మట్టిమాఫియా వల్ల పార్టీకి చెడ్డపేరు వస్తుంది. కష్టపడ్డ కార్యకర్తలను ఆదుకోవాలని విజ్ఞప్తి చేసినట్లు చెబుతున్నారు.

టీడీపీ కార్యాలయం తొలగింపు

కడప నగరం చిన్నచౌకులోని అప్సర సర్కిల్‌లో ఏర్పాటు చేసిన టీడీపీ కార్యాలయాన్ని సోమవారం సాయంత్రం, రాత్రి మూసివేశారు. ఈ ఏడాది 1 నుంచి 15 డివిజన్ల కేడరు కోసమంటూ గత ఏడాది జూన్ 16న ఎమ్మెల్యే ఆర్.మాధవి పార్టీ కార్యాలయాన్ని ఓపెన్ చేశారు. ఇది వైసీపీ నేత గుమ్మా రాజేంద్రనాథరెడ్డికి చెందినదని చెబుతారు. ఇక్కడ కార్యాలయం ఏర్పాటు చేయడంతో అప్పట్లో విమర్శలు వచ్చాయి. అయితే ఇటీవల టీడీపీ సోషల్ మీడియాలో కడప అప్సర సర్కిల్ చిన్నచౌకు ఏరియా ఆఫీసు ఏ హోదాతో నడుపుతున్నారు, ప్యారాచూట్ బ్రదర్స్ ఐదుగురు క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు, 15 మంది యూనిట్ ఇన్‌చార్జ్‌లు, 105 మంది బూత్‌ఇన్‌చార్జ్‌లు, వెయ్యి మంది కార్యకర్తల అనుమతి ఉందా అంటూ ప్రశ్నిస్తూ పోస్టు చేశారు. ఈ నేపథ్యంలో ఇక్కడ కార్యాలయం క్లోజ్ చేయడం చర్చనీయాంశంగా మారింది.



మహానాడు కోసం స్థలాన్ని పరిశీలిస్తున్న మంత్రి సవిత



చిన్నచౌకులో టీడీపీ ఆఫీసును తొలగించిన దృశ్యం

పంచాయతీల్లో పుట్టగొడుగుల్లా

బహుళ అంతస్థుల భవనాలు

- అనుమతికి మించి కట్టడాలు
- గ్రామ పంచాయతీల ఆదాయానికి గండి


తట్టివారిపల్లె పంచాయతీలో నిర్మించిన బహుళ అంతస్థుల భవనం

మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీల్లో బహుళ అంతస్థుల భవనాలు నిర్మించడం పరిపాటి, అయితే మేజర్ గ్రామ పంచాయతీలు, పట్టణాల శివారులోని గ్రామ పంచాయతీల్లో పుట్టగొడుగుల్లా బహుళ అంతస్థుల భవనాలు పుట్టుకొస్తున్నాయి. ఆకాశహర్మ్యాలను తలదన్నే రీతిలో గ్రామ పంచాయతీల్లో ఐదంతస్థుల భవనాలు నిర్మించిన కొందరు యజమానులు ఆయా పంచాయతీల ఆదాయానికి గండి కొడుతున్నారు. మదనపల్లె పంచాయతీ డివిజన్‌లో మేజర్ పంచాయతీలు అయిన అంగళ్లు, వాల్మీకిపురం, పీలేరు, చింతపర్తి, గుర్రంకొండ, కలికిరి, కలకడ, ములకలచెరువు, సీటీఎంతో పాటు మదనపల్లె పట్టణానికి శివారులో ఉన్న తట్టివారిపల్లె, కురవంక, అంకిశెట్టిపల్లె, కొత్తపల్లె, బసినికొండ, కొండామర్రిపల్లె, కోళ్లబైలు గ్రామ పంచాయతీలున్నాయి. ఈ పంచాయతీల ఆదాయానికి ప్రధాన వనరులు ఇళ్ల నిర్మాణానికి ప్లాన్ అప్రూవల్ ఫీజులు, ఇంటి పన్నులే. ఇటువంటి పంచాయతీలో గత ఐదేళ్లుగా బహుళ అంతస్థుల భవనాలను ఇష్టారాజ్యంగా నిర్మిస్తూనే ఉన్నారు. వాస్తవంగా గ్రామ పంచాయతీల్లో జీ ప్లస్ టు వరకే ఇళ్ల నిర్మాణానికి అనుమతులు ఇస్తారు. ఒకవేళ ఐదంతస్థుల భవనాలు నిర్మించాలనుకేంటే డీటీసీపీ అప్రూవల్ తప్పని సరి తీసుకోవాలి. కాని ఇవేమి పట్టించికోకుండా గత వైసీపీ పాలనలో పీలేరు, అంగళ్లు, సీటీఎం, తట్టివారిపల్లె, కురవంక, అంకిశెట్టిపల్లె , ములకలచెరువు గ్రామ పంచాయతీల్లో ఇబ్బడిముబ్బడిగా ఐదంతస్థుల భవనాలను నిర్మించేశారు. కొందరేమో జీ ప్లస్ టు భవన నిర్మాణాలకు ప్లాన్ అప్రూవల్ తీసుకున్నా, క్షేత్రస్థాయిలో మాత్రం ఐదంతస్థుల భవనాలను నిర్మించేశారు. రికార్డులో మాత్రం జీ ప్లస్ టు భవనాలు ఉన్నట్లు చూపుతూ వాటికి నిర్దేశించిన ఇంటి పన్నులు మాత్రమే చెల్లించి, అదనపు భవనాలకు చెల్లించాల్సిన పన్నులు ఎగవేస్తున్నారు.

అంగళ్లులో అతిగా బహుళ అంతస్థులు

కురబలకోట మండలం అంగళ్లులో పలు ఇంజినీరింగ్ విద్యాసంస్థలు ఉండటంతో వేలాది మంది విద్యార్థులు ఇక్కడకు వచ్చి చదువుతున్నారు. వారందరు నివసించేందుకు పదుల సంఖ్యలో పేయింగ్ గెస్ట్ హాస్టళ్లను నిర్మించారు. కేవలం ఒక్క అంగళ్లులోనే 50కి పైగా బహుళ అంతస్థుల భవనాలు ఉన్నాయంటే అతిశయోక్తి కాదు. ముఖ్యంగా వైసీపీ పాలనలో కనీస అనుమతులు లేకుండా బహుళ అంతస్థుల భవనాలు నిర్మించి, పంచాయతీలకు ఇంటి పన్నులు ఎగగొడుతున్నారు.

పంచాయతీల ఆదాయానికి భారీగా గండి

గ్రామ పంచాయతీల్లో ఒక్కో చదరపు అడుగుకు 0.50 పైసల నుంచి రూ.1.50 చొప్పున ఇంటి పన్నులు వసూలు చేస్తారు. సాధారణంగా మేజర్ గ్రామ పంచాయతీల్లో ఒక్కో బహుళ అంతస్థుల భవనం ఎంత లేదన్నా ఐదంస్థులతో నిర్మించారంటే సుమారు 10వేల చదరపు అడుగులకు ఈ భవన యజమానులు ఇంటి పన్నులు చెల్లించాలి. సరాసరిన ఒక్కో భవనానికి ఇంటి పన్ను రూ.10వేల నుంచి రూ.15వేల దాకా ప్రతి ఏటా చెల్లించాలి. డివిజన్‌లో ఇలాంటి భవనాలు 150 నుంచి 200పైగా ఉన్నాయి. ఈ క్రమంలో ప్రతి ఏటా రూ.30లక్షల దాకా గ్రామ పంచాయతీలు ఆదాయాన్ని కోల్పోతున్నాయి. వాటికి ప్లాన్ అప్రూవల్ ఫీజులు అదనంగా నష్టం వాటిల్లుతోంది. ఇప్పటికైనా పంచాయతీ రాజ్‌శాఖ అధికారులు దృష్టి పెడితే భవనాలు నిర్మించిన తేది నుంచి ఇంటి పన్నులు, ప్లాన్ అప్రూవల్ ఫీజులు, మొండి బకాయిలు వసూలు చేసి పంచాయతీల ఆదాయాన్ని పెంచేందుకు కృషి చేయాల్సి ఉంది.


సీటీఎం-1 పంచాయతీలో నిర్మించిన బహుళ అంతస్థుల భవనం

పీకేఎం ఉడా వారికి నివేదిస్తాం

మదనపల్లె పంచాయతీ డివిజన్‌లో అప్రూవల్ లేని బహుళ అంతస్థుల భవనాలు మీద విచారణ చేస్తున్నాం. వాటిపై పీకేఎం ఉడా పరిధిలో వస్తున్నందున వాటి వివరాలను పీకేఎం ఉడా వైస్‌చైర్మన్‌కు నివేదిస్తాం. చాలా వరకు భవన యజమానులకు నోటీసులు జారీ చేశాం. మూడో నోటీసుకు కూడా స్పందించని వారిపై కోర్టులో కేసులు పెడతాం.

-నాగరాజు, డీఎల్‌పీవో, మదనపల్లె

వాటర్ షెడ్ పనులను వేగవంతం చేయండి

- రూ.3.50 కోట్లతో పనులు
- డ్వామా పీడీ వెంకటరత్నం వెల్లడి


వాటర్ షెడ్ పనులను పరిశీలిస్తున్న డ్వామా పీడీ వెంకటరత్నం

పెద్దతిప్పసముద్రం ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): పెద్దతిప్పసముద్రం మండలంలోని వివిధ గ్రామాల్లో చేపడు తున్న వాటర్ షెడ్ పనులను వేగ వంతం చేయాలని జిల్లా డ్వామా పీడీ వెంకటరత్నం సూచించారు. మంగళవారం ఆయన మండలంలోని సంపతికోట ప్రాజెక్టు పరిధిలోని బూచిపల్లె గ్రామంలో జరుగుతున్న వాటర్ షెడ్ నిర్మాణ పనులను ప్రాజెక్టు అధికారి ఖాజా మొహిద్దీన్, వాటర్ షెడ్ జేఈ దీపక్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా పీడీ వెంకటరత్నం మాట్లాడుతూ పెద్దతిప్పసముద్రం మండలంలోని సంపతికోట వాటర్‌షెడ్ ప్రాజెక్టు పరిధిలోని రంగసముద్రం, రాపూరివాండ్లపల్లె, మడుమూరు, పులికల్లు, సంపతికోట, బూచిపల్లె గ్రామాల్లో రూ.3.50 కోట్లతో వివిధ రకాల 39 పనులను చేపట్టినట్లు పేర్కొన్నారు. వాటర్ షెడ్‌లో నిధులు విరివిగా ఉన్నాయని, పనులను వేగవంతంగా చేపడితే బిల్లులు అప్పటికప్పుడు మంజూరు చేసేందుకు తాము సిద్ధంగా ఉన్నామన్నారు. భూగర్భ జలాలు పెంపొందించేందుకు వాటర్ షెడ్ పనులు ఎంతగానో ఉపయోగపడ తాయని అందువల్ల రైతులు ముందుకు వచ్చి అధికారులతో సమన్వయం చేసుకుని నిధులను వినియోగించుకోవాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన గ్రామాల్లో చిన్న ఊటకుంటలు 28, పెద్ద ఊటకుంటలు 6, రాతి సప్పిళ్లు 5 పనులను గుర్తించగా నిర్దేశించిన గ్రామాల్లో రూ 30 లక్షలతో పనులు జరుగుతున్నాయన్నారు. సంపతికోట సర్పంచ్ ఎం. చిన్నరెడ్డెప్ప, సింగల్ విండో మాజీ చైర్మన్ సంపతికోట కిట్టన్న, బూచిపల్లె మాజీ సర్పంచ్ కేశవ, బూచిపల్లె మాజీ ఎంపీటీసీ గంగిరెడ్డితో పాటుగా రైతులు, వాటర్ షెడ్ సిబ్బంది పాల్గొన్నారు.

మదనపల్లెలో కిలో రూ.100కే తెల్లగడ్డలు

మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): మదనపల్లెలో నాలుగు రోజుల వరకు కిలో రూ.400 పలికిన తెల్లగడ్డలు(తెల్లుల్లి) మంగళవారం కేవలం కిలో రూ.100కే దొరకడంతో జనాలు ఎగబడి కొన్నారు. తెల్లగడ్డలు రాష్ట్ర వ్యాప్తంగా ధరలు పడిపోయి కిలో రూ.200 చొప్పున విక్రయిస్తున్నారు. స్థానిక రైతుబజార్‌లో కూడా తెల్లగడ్డలు కిలో రూ.200 దొరుకుతున్నాయి. ఈ క్రమంలో స్థానిక టిప్పుసుల్తాన్ మైదానం వద్ద ఒక వ్యాపారి ఆటోలో 100 బస్తాల తెల్లగడ్డలు తీసుకొచ్చి కిలో రూ.100కే విక్రయించాడు. దారింటి వెళుతున్న ప్రజలు ఇది గమనించి రూ.100కే కిలో తెల్లగడ్డలు దొరుకుతుండటంతో ఒక్కసారిగా ఎగబడ్డారు. తీరా చూస్తే ఈ తెల్లగడ్డలు పచ్చివి కావడంతో బరువు ఎక్కువ తూగడంతో వ్యాపారి కిలో రూ.100కే విక్రయించి సొమ్ములు చేసుకున్నాడు.

రజకుల అభివృద్ధికి కూటమి ప్రభుత్వ తోడ్పాటు


రజక సంఘం నూతన కమిటీని అభినందిస్తున్న రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాగయ్య

మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 4(ఆం ధ్రజ్యోతి): రజకులు అన్ని విధాల అభివృద్ధి చెందడానికి రాష్ట్ర ప్రభుత్వం తోడ్పాటునిస్తోందని రాష్ట్ర రజక సంఘాల ఉపాధ్యక్షుడు మునలికుంట నాగయ్య పేర్కొన్నారు. మంగళవారం స్థానిక మార్కెట్‌యార్డు వద్ద పోలేరమ్మ రజక సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. ఈ సందర్భంగా నాగయ్య మాట్లాడుతూ ఎమ్మెల్యే షాజహాన్ బాషా దోభీఘాట్‌కు స్థలాన్ని కేటాయించారని, ఈ స్థలం చుట్టూ ప్రహరీ నిర్మించు కోవాలన్నారు. దోభీఘాట్‌లో నీటికోసం బోరు, తొట్లు నిర్మించేందుకు ఎమ్మెల్యే కృషి చేస్తానని హామీ ఇచ్చారన్నారు. కార్యక్రమంలో రజక సాధికారకమిటీ సభ్యుడు ఎం. రామ్మూర్తి, నూతన కార్యవర్గం అధ్యక్షుడు జి.రెడ్డెప్ప, ఉపాధ్యక్షులు ఎం.ఆంజనేయులు, రామలక్ష్మమ్మ ప్రధాన కార్యదర్శి ఎం.చంద్రశేఖర్, కార్యదర్శి రమణమ్మ, కోశాధికారి చంద్రశేఖర్, సభ్యులు లక్ష్మీదేవి, శ్రీనివాసులు, శంకర, చంద్రమ్మ, వీరాంజేయులు పాల్గొన్నారు.

మదనపల్లె, నిమ్మనపల్లె తహసీల్దార్ల పరస్పర బదిలీలు

మదనపల్లె అర్బన్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి):మదనపల్లె, నిమ్మనపల్లె తహసీల్దార్లు మంగళవారం పరస్పర బదిలీలు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మదనపల్లె తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న ఖాజాబీ నిమ్మనపల్లె మండల తహసీల్దార్ కార్యాలయానికి, అక్కడ నిమ్మనపల్లె తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్‌గా పని చేస్తున్న ధనంజేయులు మదనపల్లె తహసీల్దార్ కార్యాలయానికి బదిలీ అయ్యారు. వారు ఇరువురు త్వరలో తహసీల్దార్లుగా బాధ్యతలు చేపట్టనున్నారు.

నాణ్యతా ప్రమాణాలపై అవగాహన ఉండాలి



విద్యార్థులతో స్టాండర్డ్ క్లబ్ నిర్వాహకులు, ఉపాధ్యాయులు

ములకలచెరువు, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశ నుంచే నాణ్యతా ప్రమాణాలపై అవగాహన పెంచుకోవాలని బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ క్లబ్ సభ్యులు రాధా, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నాగమోహన్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని బురకాయలకోట జడ్పీ హైస్కూల్‌లో మంగళవారం స్టాండర్డ్స్ క్లబ్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ కొనుగోలు చేసిన ప్రతి వస్తువు, ఆహార పదార్థాలు ఎలా ఎంపిక చేసుకోవాలి, నాటిలో ఉన్న నాణ్యత, ప్రమాణాల గురించి తెలుసుకోవడానికి ఈ క్లబ్ ఉపయోగపడుతుందన్నారు. విద్యార్థులకు దేశ ఆర్థిక వ్యవస్థలో బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ ప్రాముఖ్యత గురించి వ్యాస రచన పోటీలు నిర్వహించి ప్రశాంసా పత్రాలు, జ్ఞాపికలను, నగదు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో బాహ్యగురువు అన్వర్‌సాధక్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీలకు ద్రోహం చేస్తే సహించేదిలేదు


దళిత దీక్ష చేస్తున్న బాస్ నేత పీటీఎం శివప్రసాద్, తదితరులు

మదనపల్లె, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలను తుంగలో తొక్కి ఎస్సీ, ఎస్టీలకు ద్రోహం చేస్తే, సహించేదిలేదని వీసీకే పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పీటీఎం శివప్రసాద్ పేర్కొన్నారు. స్థానిక బెంగళూరురోడ్డులోని అంబేడ్కర్ సర్కిల్‌లో మంగళవారం దళిత దీక్ష పేరుతో వీసీకే, బాస్ సంయుక్తంగా నిరాహార దీక్ష చేపట్టారు. తథాగతుడు గౌతమ బుద్ధుని చిత్రపటం ముందు మోకరిల్లి త్రిశరణ, పంచశీల పఠించి శివప్రసాద్ ప్రారంభించిన దీక్ష సూర్యాస్తమయం వరకూ సాగింది. ఇందులో వైసీపీ ఇన్‌చార్జి నిసార్ అహ్మద్, ఏపీ గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భూక్యా విశ్వనాథ్‌నాయక్, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కృష్ణప్ప, ఏఐటీయూసీ సాంబశివ, వాల్మీకిసంఘం నేతలు ఎన్.సుదర్శన్‌బాబు, గిరిజన నేత కోనేటి దివాకర్, జలిజసంఘం సేవాసంఘం నేత నరేంద్రనాయుడు, తదితరులు దీక్షలో పాల్గొని సంఘీభావం ప్రకటించారు. ఎస్సీ, ఎస్టీలంతా కాంగ్రెస్‌కు సంప్రదాయ ఓటు బ్యాంకుగా ఉండగా, 2019లో వైసీపీకి, 2024లో టీడీపీకి ఓట్లు వేసినట్లు బాస్ నేత పీటీఎం శివప్రసాద్ పేర్కొన్నారు. అనంతరం ఇక్కడ శివప్రసాద్ జన్మదిన వేడుకల కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బాస్ నాయకులు నీరుగట్టి రమణ, చాట్ల బయన్న, వీసీకే పార్టీ రాష్ట్రకార్యదర్శి పల్లం తాతయ్య, మీడియా సెక్రటరీ టి.ఎ.పీర్‌బాషా, రవిశంకర్, రెడ్డెప్ప, చిన్నా, తలారి కృష్ణ, బురుజు జనార్దన్, రెడ్డిప్రసాద్, సురేష్, కళ్యాణ్, రాజేష్, గంగాధర్, ఇర్ఫాన్ పాల్గొన్నారు.

ఘనంగా 'బాస్' వ్యవస్థాపక అధ్యక్షుడి జన్మదిన వేడుకలు


వృద్ధాశ్రమంలో అన్నదానం చేస్తున్న 'బాస్' సభ్యులు

పీలేరు, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): భారతీయ అంబేడ్కర్ సేన(బాస్) వ్యవస్థాపక అధ్యక్షుడైన పీటీఎం శివప్రసాద్ జన్మదినాన్ని మంగళవారం ఆ సంస్థ సభ్యులు ఘనంగా జరుపు కున్నారు. ఈ సందర్భంగా స్థానిక లక్ష్మీ వృద్ధాశ్రమంలో అన్నదానం చేపట్టారు. అనంతరం 'బాస్' జిల్లా కో-కన్వీ నర్ పాలకుంట శ్రీనివాసులు మాట్లా డుతూ గడిచిన నాలుగు దశాబ్దాలుగా రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, ముస్లిం మైనారిటీల సంక్షేమం కోసం శివప్రసాద్ పోరాడుతున్నారన్నారు. మదనపల్లె పట్టణంలో రాష్ట్రంలోనే రెండో అతి పెద్దదైన గౌతమ బుద్ధుడి విగ్రహాన్ని నెలకొల్పి సమసమాజ స్థాపనకు కృషి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ముల్లంగి కృష్ణయ్య, నాగరాజ, గురునాథ, గంగాధర్, హరినాథ, గురవయ్య, హరీశ్, రవీంద్ర, తదితరులు పాల్గొన్నారు.

దారి సమస్యను పరిష్కరించండి

గుర్రంకొండ, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): పొలాలకు వెళ్లేందుకు దారిని చూ పాలంటూ సుంకరవాండ్లపల్లె గ్రామస్థులు మంగళవారం తహశీల్దార్ శ్రీనివాసులను కోరారు. గ్రామానికి చెందిన రైతులు తమ పొలాలకు వెళ్లేందుకు దారి లేకపోవడంతో సమస్యగా ఉందన్నారు. ఈ క్రమంలో కొందరు రైతులు సోమవారం జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. దీంతో రెవెన్యూ అధికారులు దారి విషయమై గ్రామంలో ఇరువర్గాలకు చెందిన రైతులను పిలిపించి మాట్లాడారు. రైతులు అందరూ కలిసి దారి సమస్యను సామర్యంగా పరిష్కరించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ మధురామ చంద్రుడు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

రేపు చేపల చెరువుల వేలం

నిమ్మనపల్లి ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాచవేటివారిపల్లి పంచాయతిలో గల 14చెరువులకు సంబంధించి స్థానిక పంచాయతి కార్యాలయంలో 6వతేదీ వేలం నిర్వహించనున్నట్లు కార్యదర్శి మారెప్ప తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ పంచాయతిలో గల ఎర్రచెరువు, కొత్తచెరువు, చెన్నకొనిచెరువు, ఈతచెరువు, తేరగానిచెరువు, పెద్దచెరువు, నాగన్నచెరువు, వీరబద్రచెరువు, సుబ్బనిచెరువు, చపటకుంట, పెద్దఒడ్డు, వీరనాయునిచెరువు, చిన్నకుంట, పెద్దకుంటలకు సంబంధించిన చెరు వులకు గురువారం వేలం నిర్వహిస్తామని వేలంలో పాల్గొనే వారు పంచాయతికి ఎటువంటి అప్పు ఉండరాదరి అలాగే వేలంలో పాల్గొనదలచే వారు ముందస్తుగా డిపాజిట్ రూ.5వేలు చెల్లించి వేలంలో పాల్గొనాలన్నారు.

పెండింగ్ కేసులను త్వరితగతిన పూర్తి చేయాలి

ములకలచెరువు, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): పెండింగ్ కేసులను త్వరితగతిన పూర్తి చేయాలని సీఐ లక్ష్మన్న ఆదేశించారు. స్థానిక సర్కిల్ కార్యాలయంలో మంగళవారం ములకలచెరువు, పెద్దమండ్యం, తంబళ్లపల్లె, పెద్దతిప్పసముద్రం ఎస్ఐలతో జరిగిన క్రైం మీటింగ్‌లో ఆయన మాట్లాడుతూ పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుపై తక్షణం స్పందించాలన్నారు. అనంతరం పోలీస్‌స్టేషన్ల వారిగా సమీక్ష జరిపారు. ఈ సమావేశంలో ఎస్ఐలు లోకేష్‌రెడ్డి, నరసింహుడు, రమణ, సిబ్బంది పాల్గొన్నారు.

భూ ఆక్రమణలపై కలెక్టర్‌కు ఫిర్యాదు

బి.కొత్తకోట, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): బి.కొత్తకోట మండల పరిధిలోని మొటుకు పంచాయతీ పరిధిలో తమ ఆధీనంలో ఏళ్ల తరబడి ఉన్న భూములను స్థానికంగా ఉన్న ఓ నాయకుడు అక్రమంగా కబ్జాకు ప్రయత్నిస్తున్నాడని, అతని బారి నుంచి కాపాడాలని కొందరు బాధిత రైతులు జిల్లా కలెక్టర్ శ్రీధర్‌చామకూరికి ఫిర్యాదు చేశారు. రెండు సర్వే నంబర్లలో 3 ఎకరాలకు పైగా ఉన్న భూమిని తన పేరిట ఆన్‌లైన్ చేయించుకున్నాడని, దీనిపై ప్రశ్నిస్తే మీ చేతనైంది చేసుకోండి...అని బెదిరిస్తున్నాడని బాధిత రైతులు ఫిర్యాదులో వాపోయారు. సదరు పీజీఆర్‌ఎస్ ఫిర్యాదు బి.కొత్తకోట తహశీల్దార్ కార్యాలయానికి ఫార్వర్డ్ చేస్తూ విచారణకు కలెక్టర్ ఆదేశించారు. ఈ విషయమై తహశీల్దార్ అజారుద్దీన్ మాట్లాడుతూ సమస్యను క్షేత్రస్థాయిలో విచారణ చేసి తగు నివేదికను కలెక్టర్ కు పంపుతామన్నారు.

పులికల్లులో మదనంత నాగేశ్వరస్వామి తిరునాళ్లు

పెద్దతిప్పసముద్రం ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పులికల్లు గ్రామంలో వెలసిన మదనంత నాగేశ్వర స్వామి తిరుణాల వైభవంగా జరుగుతోంది. గత మూడు రోజులుగా జరుగుతున్న వేడుకల్లో భాగంగా మంగళవారం స్వామి వారి రథోత్సవం కనులపండుగగా జరిగింది. 11 సంవత్సరాల తరువాత తిరిగి ఇప్పుడు రథోత్సవ కార్యక్రమాన్ని పునః ప్రారంబించినట్లు గ్రామస్థులు పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామస్థులు అదిక సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు.

క్యాన్సర్‌పై అవగాహన కలిగి ఉండాలి


క్యాన్సర్‌పై అవగాహన కల్పిస్తున్న వైద్యులు

తంబళ్లపల్లె, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): క్యాన్సర్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని తంబళ్లపల్లె ప్రభుత్వాసుపత్రి వైద్యుడు రిచర్డ్స్ అమర సింహరాజు పేర్కొన్నారు. మంగళవారం ప్రపంచ క్యాన్సర్ నివారణ దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రభుత్వాసుపత్రిలో రోగులకు, ప్రజలకు క్యాన్సర్ వ్యాధిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.


తలపులలో ర్యాలీ నిర్వహిస్తున్న పీహెచ్‌సీ సిబ్బంది

పీలేరులో: ప్రపంచ క్యాన్సర్ నివారణ దినోత్సవాన్ని మంగళవారం పీలేరు మండలం తలపుల పీహెచ్‌సీ, లయన్స్ క్లబ్, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) సభ్యులు ఘనంగా నిర్వహించారు. తలపుల గ్రామంలో క్యాన్సర్ అవగాహన ర్యాలీ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పీహెచ్ సీ వైద్యాధికారి రమేశ్ రెడ్డి మాట్లాడుతూ ముందస్తు ఆరోగ్య పరీక్షలతో క్యాన్సర్ మహమ్మారికి అడ్డుకట్ట వేయవచ్చన్నారు. పీలేరులోని సీఎన్ఆర్ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో పీలేరు ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రస్తుత జీవనశైలి కారణంగా యువత కూడా అధికంగా క్యాన్సర్ బారిన పడుతున్నారన్నారు. ఐఎంఏ పీలేరు శాఖ అధ్యక్షురాలు డాక్టర్ మమతాలక్ష్మి, డాక్టర్ శ్వేతారాణి, వైద్యాధికారి చంద్రశేఖర్ నాయక్, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు పామిడి మహేశ్, సీఎన్ఆర్ కళాశాల అధినేత విజయ భాస్కరరెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ లావణ్య, హెచ్ఈ కొండయ్య, లయన్స్ క్లబ్ సభ్యులు, సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు, సీహెచ్‌వోలు, ఆశాలు పాల్గొన్నారు.

వాల్మీకిపురంలో: వ్యక్తి అలవాట్ల మార్పు ద్వారా క్యాన్సర్ వ్యాధిని నిర్మూలించవచ్చని వాల్మీకిపురం ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రవి కుమార్ పేర్కొన్నారు. మంగళవారం వైద్యులు, సిబ్బందితో పురవీధులలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈకార్యక్రమాలలో జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు ప్రభుచరణ్, డాక్టర్లు సోని, శివాణి, అక్షితారెడ్డి, హిమబిందు, విక్రాంత్, ఆసీఫ్, రఫీ, టీబీ పర్యవేక్షకులు నాగిరెడ్డి, ప్రిన్సిపాల్ కల్పన, వైద్య సిబ్బంది ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

మదనపల్లె అర్బన్‌లో:స్థానిక జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో మంగళవారం క్యాన్సర్‌పై డాక్టర్ సౌమ్యపల్లవి (హ్యూమన్‌క్యాపిటల్ మేనేజమెంట్)ద్వారా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ వేడి వస్తువలకు ప్లాస్టిక్ కవర్లు వాడరాదని తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఎంవో డాక్టర్ మస్రూర్ అహమ్మద్, డాక్టర్ రమేష్, డాక్రట్ కోటేశ్వరీ, నర్సింగ్ సూపరింటెడెంట్ మంజు, తదితరులు పాల్గొన్నారు.

సాఫ్ట్‌వేర్ రంగంలో అజూర్ డేటా కీలకం

కురబలకోట, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): సాఫ్ట్‌వేర్ రంగంలో అజూర్ డేటా, బీ1డేటాలు కీలకమని, వాటిపై పట్టు సాధిస్తే మెరుగైన ఉపాధి అవకాశాలను సాధించవచ్చని రీసోర్సుపర్సన్ తమిముల్ అన్సారీ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని మిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో సీఎస్ఈ డేటా సైన్స్ విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులకు అడ్వాన్సింగ్ సస్టైనబిలి త్రూ డేటా అజూర్ డేటా ఇంజనీరింగ్ బీ1 ఇన్ యాక్షన్ అంశంపై వర్క్‌షాప్‌ను నిర్వహించారు. విభాగాధిపతి కుసుమ, కోఆర్డినేటర్ మంజుల పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్.. రూ.1.30 లక్షలు స్వాధీనం

బి.కొత్తకోట, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుడిపల్లె శివారులో జూదం ఆడుతున్న 12 మందిని అరెస్టు చేసి రూ.1.30,720 నగదును స్వాధీనం చేసుకున్నట్లు సీఐ జీవన్‌గంగనాథ్‌బాబు తెలిపారు. మంగళవారం పేకాట స్థావరం పై సిబ్బందితో దాడులు న్విహించి 12 మంది పేకాటరాయుళ్లు ను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశామన్నారు. అదే విధంగా 5 మోటార్ సైకిళ్లు, 8 మొబైల్‌ఫోన్‌లు రూ.1.30,720 నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు.

బి.కొత్తకోటకు రెగ్యులర్ ఉద్యోగులు

బి.కొత్తకోట. ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా 176 మంది గ్రామపంచాయతీ సిబ్బందిని అప్‌గ్రేడ్ చేసి మున్సిపల్‌శాఖలో విలీనం చేస్తూ మంగళవారం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇలా అప్‌గ్రేడ్ అయిన 8 పంచాయతీలలో బి.కొత్తకోట కూడా ఒకటి. బి.కొత్తకోటలో పనిచేస్తున్న తాత్కాలిక సిబ్బంది స్థానంలో 12 మంది రెగ్యులర్ సిబ్బంది ఇక్కడికి రానున్నారు. సవరించిన వేతనాన్ని పొందనున్నారు.

భక్తిశ్రద్ధలతో రథసప్తమి వేడుకలు


సూర్య భగవానుడికి అభిషేకం చేస్తున్న నాదేళ్ల బాబునాయుడు

మదనపల్లె అర్బన్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బర్మా వీధిలోని షిరిడిసాయిబాబా ఆలయంలో మంగళవారం ఆలయకమిటీ సభ్యులు రథసప్తమి వేడుకలను భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. ఉదయాన్నే ఆలయంలో సూర్య భగవానునిడి విగ్రహం ఏర్పాటు చేసి ఆలయమిటీ ఉపాధ్యక్షుడు నాదేళ్ల బాబునాయుడు కుటుం బ సభ్యులతోపాటు భక్తులు క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. నవగ్రహాల అధిపతి సూర్యభగవాన్ని విశేషంగా అలంకరణ చేసి భక్తులకు దర్శనం కల్పించి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమాలను ఉపాధ్యక్షుడు బాబునాయుడు, శ్రీరాములు నాయుడు, నాగార్జున బాబు ఆలయకమిటీ సభ్యులు పాల్గొన్నారు. కాగా రథసప్తమి పండుగ పురస్కరించుకుని మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్‌బాషా తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. మంగళవారం వేకువఝామునే ఆలయానికి చేరుకున్న ఎమ్మెల్యే వెంకటేశ్వరస్వామిని దర్శించుకుని నియోజకవర్గ ప్రజలు సుభిక్షంగా, సమస్యలు లేకుండా ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. ఆయన వెంట టీడీపీ నాయకుడు మార్పురి వరుణ్ తదితరులు పాల్గొన్నారు.

గుర్రంకొండలో ఊరేగిన నరసింహుడు



గుర్రంకొండ, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): గుర్రంకొండ మండలం తరిగొండ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో మంగళవారం రథసప్తమి వేడుకల సందర్భంగా వైభవంగా నరసింహ స్వామి గ్రామోత్సవం నిర్వహించారు. ఉదయాన్నే ఆలయంలో అర్చన, పంచామృతాభిషేకం, విశేష పూజలను చేశారు. అనంతరం ఉత్సవమూర్తులను సర్వాంగ సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజలను చేసి స్వామి వారిని గ్రామంలోని పురవీధులలో ఊరేగించారు. స్వామి వారిని దర్శించుకొని భక్తులకు తీర్థప్రసాదాలను స్వీకరించారు. కార్యక మంలో అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

రామసముద్రంలో: మండల కేంద్రంలో వెలసిన లక్ష్మీజనార్దనస్వామి వారి రథసప్తమి వేడుకలలో భాగంగా మంగళవారం స్వామి వారు పరవాసుదేవ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయంలో రథసప్తమి వేడుకలకు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు పార్థసారథి భట్టార్, కులశేఖర్‌భట్టార్‌లు తెలిపారు. ఈసందర్భంగా స్వామివారి దశావతారాలలో భాగంగా ప్రతిరోజు ఒక్కో అవతారంలో భక్తులకు దర్శనమిస్తారని తెలిపారు. ఈ ఉత్సవాలలో భాగంగా ఈనెల 11న శనివారం స్వామివారి బ్రహ్మరథోత్సవం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.

కలకడలో:రథ సప్తమి పండుగ పర్వదినాన్ని మంగళవారం మండల ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా గోపాలపురంలో షిర్డిసాయిబాబా ఆలయం ముందు సూర్యభగవానునికి ప్రత్యేక పూజలు చేశారు. అలాగే వివిధ ఆలయాల్లో భక్తులు తమ మొక్కులు తీర్చుకున్నారు.

వాల్మీకిపురం పట్టాభిరామాలయంలో వేడుకలు


వాల్మీకిపురంలో విశేష పూజలందుకున్న సీతాలక్ష్మణ సమేత పట్టాభిరాముడు

వాల్మీకిపురం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): వాల్మీకిపురంలో మంగళవారం రథసప్తమి పండుగ వేడుకలు పట్టాభి రామాలయంలో వైభవంగా జరిగాయి. ఉదయం ఆలయంలోని మూలవర్లకు అభిషేకం, అర్చన, తోమాల సేవలతో ప్రత్యేక పూజలు జరిగాయి. సూర్యోదయం కంటే ముందుగా భోగోత్సవ మూర్తులైన సీతాలక్ష్మణ సమేత పట్టాభిరాములను తిరుచ్చిపై వివేషాలంకరణలు గావించి పురవీధులలో నగరోత్సవం నిర్వహించారు. ఉత్సవం స్థానిక పట్టాభిరాముడి రథం వద్దకు చేరుకోగా అక్కడ విశేష భక్తజనం నడుమ ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు రథసప్తమి విశిష్టతను తెలియజేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో ఆలయ అధికారులు కృష్ణమూర్తి, నాగరాజు, అర్చక బృందం, భక్తులు పాల్గొన్నారు.

'రాజ్యాంగాన్ని గౌరవించని ఆర్ఎస్ఎస్ ఎందుకు?'



నినాదాలు చేస్తున్న ఎన్ఎస్‌యూఐ శ్రేణులు

పీలేరు, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): దేశ రాజ్యాంగాన్ని ఆర్ఎస్ఎస్ గౌరవించదని, దేశ త్రివర్ణ పతాకాన్ని అది ఇంత వరకు అంగీకరించలేదని అలాంటి ఆర్ఎస్ఎస్‌ను వెంటనే నిషేధించాలని ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మద్దెల అమృతతేజ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎన్ఎస్‌యూఐ కేంద్ర కమిటీ పిలుపు మేరకు పీలేరులోని ఎన్ఎస్‌యూఐ శ్రేణులు ఆర్ఎస్ఎస్‌ను నిషేధించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా అమృతతేజ మాట్లాడుతూ రాజ్యాంగాన్ని కాకుండా మనుస్మృతిని పాటిస్తూ దేశంలోని దళితులు, వెనుకబడిన వర్గాలు, ముస్లింలు, క్రైస్తవుల హక్కులను నిరాకరిస్తోందన్నారు. ప్రభుత్వం, విద్య, పరిపాలన అంశాల్లో ఆర్ఎస్ఎస్ చొరబాటు ప్రమాదకరమన్నారు. వీటన్నింటిని దృష్టిలో పెట్టుకుని ఆ సంస్థను వెంటనే నిషేధించాలన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ నాయకులు సాయి సంపత్ కుమార్, సాంబ, సాయి రెడ్డి పాల్గొన్నారు.